గురుకులంలో ప్రకృతి ప్రసాదం

- సాగర్ గురుకులంలో విద్యార్థులకు జీవిత పాఠాలు
- పాఠశాల ఆవరణలో ప్రకృతి వ్యవసాయం

6



చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

గ్రామపంచాయతీ ఎన్నికల్లో రాజకీయ ఆసక్తికర పరిణామాలు నెలకొంటున్నాయి. పార్టీరహితంగా జరిగే ఎన్నికలైనప్పటికీ మంత్రులు సహా నాయకులంతా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో గ్రామాల్లో పార్టీల ప్రాతిపదికనే సమరం సాగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్ని చోట్ల పోటీకి సిద్ధమవగా, బీజేపీ, టీడీపీ, సీపీఎం, సీపీఐ పొత్తులు, స్థానిక సర్దుబాట్లతో ఎన్నికల బరిలో నిలవాలని సంకల్పించాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



పొత్తుల పంచాయతీలు

- పార్టీరహితం కావడంతో స్థానిక సర్దుబాట్లు
- నేతల నడుమ మొదలైన చర్చలు
- బీఆర్ఎస్ కొన్నిచోట్ల బీజేపీతో, మరికొన్ని చోట్ల సీపీఎంతో సీట్ల పంపకం
- అటు కాంగ్రెస్, ఇటు సీపీఎంతో సీపీఐ పొత్తు
- టీడీపీతో సర్దుబాటుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రయత్నాలు

కాంగ్రెస్‌తో రాష్ట్ర స్థాయిలో మైత్రి ఉండడంతో సీపీఐ ఆ పార్టీతో పాటు, సోదర మిత్రపక్షం సీపీఎంతో కలిసి పోటీలోకి దిగేందుకు సిద్ధమైంది. సీపీఎం రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్‌తో సఖ్యతగా ఉంటున్నందున జిల్లా కమిటీలు, మండల కమిటీలు అక్కడి స్థానిక పరిస్థితులు, క్యాడర్ మనోభావాల మేరకు సీపీఐతో సఖ్యతను కొనసాగిస్తూ అయితే కాంగ్రెస్, లేందటే బీఆర్ఎస్‌తో సీట్ల సర్దుబాటు చేసుకునేందుకు సిద్ధమయ్యాయి. ఈ మేరకు చర్చలు కూడా ప్రారంభమయ్యాయి. బీజేపీ సైతం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాల ప్రకారం అన్ని గ్రామాల్లో పోటీచేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ పోటీపడే బలమైన నాయకుడు లేనిచోట్ల, అధికార కాంగ్రెస్‌ను తట్టుకునేందుకు పలుచోట్ల బీఆర్ఎస్‌తో జతకడుతోంది. ఉపసర్పంచ్ పదవులు, భవిష్యత్‌లో ఎంపీటీసీ పదవులతో పాటు, కొన్ని వార్డుల్లో సీట్ల సర్దుబాటు చేసుకునేందుకు ఆ పార్టీ నేతలు సిద్ధమయ్యారు. టీడీపీ సైతం క్యాడర్ అభిప్రాయాల మేరకు కొన్నిచోట్ల కలిసొచ్చే వారితో సీట్ల సర్దుబాటు చేసుకునేందుకు సిద్ధమైనట్లు క్షేత్రస్థాయిలో చర్చ సాగుతోంది. కాంగ్రెస్ బలంగా ఉన్నచోట్ల ప్రతిపక్షాలు పొత్తు పెట్టుకొని పోటీచేయాలని నిర్ణయించడంతో గ్రామసీమల్లో బలమైన పోటీ తప్పదనే సంకేతాలు కన్పిస్తున్నాయి.

కాంగ్రెస్‌లో అభ్యర్థిత్వాలకు పోటాపోటీ

అధికార కాంగ్రెస్ నుంచి సర్పంచ్ అభ్యర్థులుగా పోటీచేసేందుకు నాయకులు పోటీపడుతున్నారు. ప్రధానంగా ఓపెన్ కేటగిరీ, బీసీ రిజర్వ్ అయినచోట్ల ఈ ఒత్తిడి ఎక్కువగా ఉంది. దీంతో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు ఇతర కీలక నేతలు అభ్యర్థుల ఎంపిక అంశాన్ని మండల కమిటీలు, ముఖ్యనాయకులు, గ్రామనాయకులకు అప్పగించి అందరి ఆమోదంతో నిర్ణయించాలని సూచించడంతో ఆశావహులంతా నామినేషన్లు వేస్తున్నారు. నామినేషన్ల ఘట్టం ముగిసి, ఉపసంహరణల దశకు వచ్చేలోగా గ్రామాల్లో మంచిపేరు, వ్యక్తిత్వం, ఆర్థిక బలం, అంగబలం ఉంటే వారిని ఎంపికచేసి, మిగిలినవారికి నచ్చజెప్పేందుకు ముఖ్యనాయకులు కార్యాచరణ అమలు చేస్తున్నారు. అదే సమయంలో పొత్తుల్లో భాగంగా సీపీఐకి, కలిసొచ్చే ఇతర పార్టీలకు సీట్ల సర్దుబాటు చేయాల్సి ఉండడంతో ఎక్కడెక్కడ వారికి అవకాశమివ్వాలనే అంశాన్ని కూడా చర్చిస్తున్నారు. ఆర్థికభారం విషయంలోనూ కీలక నేతలు పోటీచేసే అభ్యర్థులే బరువు బాధ్యతలు చూసుకోవాలని...

- మిగతా 8వ పేజీలో...

నామినేషన్ కౌంటర్ 1వ రోజు

జిల్లా	27న సర్పంచ్‌కు	ఇప్పటివరకు మొత్తం	వార్డు స్థానాలకు	ఇప్పటివరకు మొత్తం
నల్లగొండ	421	421	234	234
సూర్యాపేట	207	207	38	38
యాదాద్రి	205	205	134	134
మొత్తం	833	833	406	406

అన్నదాన సత్ర భవనానికి ముహూర్తం ఖరారు

- సుమారు రూ.23కోట్ల వ్యయం
- రోజుకు 5వేల మంది భక్తులకు భోజన సౌకర్యం



కొండకింద అన్నదాన సత్ర భవనం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి అన్నదాన సత్ర భవనం ఎట్టకేలకు ప్రారంభానికి నోచుకోనుంది. స్వయంభువులను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం అత్యాధునిక అన్నదాన సత్ర భవనాన్ని ఈ నెల 30న ప్రారంభించేందుకు ఆలయ అధికారులు ముహూర్తం ఖరారు చేశారు.

- (ఆంధ్రజ్యోతి,యాదగిరిగుట్ట)

అన్నసత్ర భవనం నిర్మాణానికి హరేరామ హరే కృష్ణ ఇస్కాన్ వంటి ఆధ్యాత్మిక సంస్థలతో సంప్రదింపుల అనంతరం గండిచెరువు సమీపంలో వైటీడీఏ డిజైన్ రూపొందించగా, మొత్తం సుమారు 2.07 ఎకరాలు కేటాయించారు. రూ.23కోట్లతో సుమారు 1.20 ఎకరాల్లో భవనాన్ని ఆధునికంగా నిర్మించారు. 2021లో ప్రారంభించిన భవన నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా గణపవరానికి చెందిన వేగేశ్న అనంతర కోటి రాజు రూ.14కోట్లు విరాళంగా ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వంట పరికరాలు, పాత్రలు శుభ్రం చేసే యంత్రాలను ఇక్కడ ఏర్పాటు. భవనంలో రెండు డైనింగ్, రెండు వెయిటింగ్ హాళ్లు, 12 స్టోరు గదులు, కేటాయించిన భూమిలో 25 శాతం వంటల గదిని నిర్మించారు. భక్తులు కూర్చోని భోజనం చేసేందుకు కుర్చీలు, టేబుళ్లు, భవన ఆవరణలో ప్రత్యేకంగా జల ప్రసాదం సిద్ధం చేశారు. నూతన భవనంలో 2వేల నుంచి 5వేల మంది భక్తులు ఒకేసారి భోజనం చేసేలా వసతి కల్పించారు.



దామరచర్లలో మండలంలో అమ్ముడుపోని ఓ ప్లాట్

దామరచర్లలో రియల్ ఢాం

- తగ్గిన పవర్ ప్లాంట్ క్రేజ్
- భూముల క్రయవిక్రయాలు తగ్గుముఖం

దామరచర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ ఏర్పాటు ప్రక్రియతో ఒక్కసారిగా దామరచర్ల మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎగసిపడింది. రోడ్లకు ఇరువైపులా ఉన్న బీడు భూములకు లక్షల నుంచి కోట్ల రూపాయలకు ధర చేరింది. ఎంతవేగంగా రియల్ ఎస్టేట్ పుంజుకుందో అంతే వేగంగా ధరలు పడిపోయాయి. దీంతో లక్షల రూపాయలు పెట్టుబడిపెట్టి స్థలాలు కొనుగోలు చేసిన వారు ప్రస్తుతం లబోదిబోమంటున్నారు.

దశాబ్దకాలంగా జిల్లాలో దామరచర్ల పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతూ వస్తోంది. నాపరాయి పరిశ్రమలతోపాటు సిమెంట్, ఇతర పరిశ్రమల ఏర్పాటుతో ఇక్కడి భూములకు కొంత మేర ధరలు పెరిగాయి. స్థానికంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ పనులు 2018 నుంచి వేగం పుంజుకున్నాయి. దీంతో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న టీఎస్‌జెన్‌కో ఉద్యోగులు బదిలీపై ఇక్కడ విధుల్లో చేరారు. దామరచర్ల, తాళ్లవీరప్పగూడెం శివారులోని ఇంటి స్థలాలు, వ్యవసాయేతర భూముల కొనుగోలుకు వారు ఆసక్తి చూపడంతో భూముల క్రయవిక్రయాలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో రోడ్డు వెంట ఉన్న భూములు ఎకరం రూ.40లక్షల నుంచి రూ.కోటి వరకు ధర పలికింది. ఊహించిన దానికంటే ఎక్కువ ధర పలకడంతో పలువురు రైతులు భూములను విక్రయించారు. వాటిని కొనుగోలు చేసిన కొందరు ప్లాట్లు, ఇంటి స్థలాలుగా మార్చి విక్రయించుకోగా, మరికొందరు వాటినే అట్టిపెట్టుకున్నారు. 2022 నుంచి పరిస్థితి భిన్నంగా మారింది. స్థలాల క్రయవిక్రయాల జోరు తగ్గింది. పరిశ్రమ పూర్తయితే స్థలాలు కొనుగోలు చేసిన వారికి భారీ లాభాలు వస్తాయని రియల్టర్ల మాటలు నమ్మి సామాన్య, మధ్యతరగతి వారు సైతం పెద్ద సంఖ్యలో ప్లాట్లు కొనుగోలు చేశారు. ధరలు పెరగకపోవడంతో తాము నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని వారు ప్రస్తుతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో రియల్ ఎస్టేట్ వేగం పుంజుకోకపోవడానికి ప్రధాన కారణం పవర్‌ప్లాంట్ క్రేజ్‌తో అధిక ధరలకు కొనుగోలు చేయడమేనని తెలుస్తోంది.

● ఇంటి స్థలం కొనుగోలు చేసి నష్టపోయా

2022లో దామరచర్ల మండల కేంద్రంలో రూ.15లక్షలు వెచ్చించి ఇంటి స్థలం కొనుగోలు చేశా. ఆ సమయంలో రియల్‌ఎస్టేట్ భూముల ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో భవిష్యత్‌లో మంచి ధర వస్తుందని అప్పు చేసి మరీ కొనుగోలు చేశా. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో స్థలానికి ధర రాకపోవడంతో విక్రయించేందుకు సిద్ధమైనా తక్కువ ధరకు అడుగుతున్నారు. దీంతో సుమారు రూ.5లక్షలు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

ఓ కొనుగోలుదారుడు

తేమ, తూకాల పేరుతో.. వసూళ్లు

ఇవ్వకుంటే కాంటాలు నిలిపివేత

ఇదీ త్రిపురారం ఐకేపీ నిర్వాహకుల దందా

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిలువునా దోచుకుంటున్నారు. తేమశాతం, తూకాల పేరుతో రైతులనుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని అడిగితే కాంటాలు వేయకుండా కొర్రీలు పెడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-త్రిపురారం)



త్రిపురారం మండలకేంద్రంలో వెలుగు ఆధ్వర్యంలో ఓమహిళా సంఘం ధాన్య కొనుగోలుకేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. సదరు మహిళలు డబ్బు సంపాందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యానికి తేమ, తూకాల పేరుతో కొర్రీలు పెడుతూ కాంటాలు వేయడంలేదు. డబ్బులు చెల్లిస్తేనే కాంటాలు వేస్తున్నారని, ధాన్యాన్ని పరిమాణాన్ని అనుసరించి రూ.1500 నుంచి రూ.5వేలు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా తేమ 17శాతం ఉండాలనే నిబంధనతో కాంటాలు వేస్తారు. ఇక్కడ మాత్రం పైసలు ఇస్తేనే పని జరుగుతుంది. లేకపోతే ధాన్యం చాలా తేమగా ఉందని కాంటాలు వేయరు.ఈ కేంద్రంలో ప్రతీ రైతునుంచి డబ్బులు వసూలు చేయడం సర్వ సాధారణంగా మారింది.

ఎందుకివ్వాలని ప్రశ్నిస్తే ఇక అంతే

తేమ శాతం తగ్గినా డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే ఇక అంతే సంగతి. ధాన్యం మిల్లుకు చేరుకున్నాక, అక్కడ తూకంలో తగ్గిందని, మీరు డబ్బులు ఇస్తే మిల్లు వాళ్లకి చెప్పి లెక్క సరి చేస్తామని చెప్పి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు నిర్వహించే కొనుగోలుకేంద్రంలో ఇప్పటివరకు 8,491 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఒక్క రైతును వదలకుండా కొర్రీలు పెట్టి భారీగా డబ్బులు గుంజినట్లు సమాచారం. ఓ గ్రామానికి చెందిన మహిళ తన పొలంలో పండిన ధాన్యాన్ని త్రిపురారం కేంద్రానికి తీసుకొచ్చింది. తేమ ఉందని, ఇప్పుడు కాంటా కాదని నిర్వాహకులు ఆమెను భయపెట్టారు. చాలా రోజులు ఆరబెట్టానని ధాన్యం బాగా ఆరిందని బతిమాలినా వారు వినిపించుకోలేదు. చివరకు 45బస్తాలకు (40 కిలోలు) రూ.16వందలు వసూలుచేశారని, ఈ విషయం ఎవరికి చెప్పినా ధాన్యం డబ్బులు పడవని నిర్వాహకులు చెప్పారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘం నిర్వాహకులు ఫోన్ ద్వారా డబ్బులు వసూలు చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. క్వింటా ధాన్యం కాంటాకు హమాలీకి రూ.45లు తీసుకోవాల్సి ఉండగా అదనంగా రూ.5 వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా విషయం బయటకు రాకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంతో రైతులు నిలువు దోపిడీకి గురయ్యారు. ఈకేంద్రంలో జరిగిన ధాన్యం కొనుగోలుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి రైతుల నుంచి డబ్బులు వసూలు చేసిన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తేమ ఉందని రూ.4,800 తీసుకున్నారు



ఐకేపీ కేంద్రానికి 50క్వింటాళ్ల ధాన్యం తెచ్చాను. తేమ పేరుతో కాంటా వేయకుండా జాప్యం చేశారు. కాంటా వేయాలంటే డబ్బులు డిమాండ్‌చేశారు. అందరూ ఇస్తున్నారు.. మీరు ఇస్తేనే పని అవుతుందని చెప్పారు. చివరకు రూ.4,800 తీసుకున్నారు. రూ.4వేలు ఫోన్‌పే ద్వారా, రూ.800 నగదు రూపంలో నిర్వాహకులకు చెల్లించాను. అధికారులు ఈకేంద్రంలో ధాన్యం విక్రయాలు చేసిన రైతులను విచారిస్తే నిజం తెలుస్తుంది.

- గజ్జి సైదులు, రైతు, కోమటిగూడెం, త్రిపురారం

మా దృష్టికి రాలేదు

కొనుగోలుకేంద్రం నిర్వాహకులు రైతులనుంచి నగదు వసూలు చేశారనే విషయం మా దృష్టికి రాలేదు. రైతులు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

- నాగేందర్, వెలుగు, ఏపీఎం

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కొర్రా లక్ష్మి

నల్లగొండ (కలెక్టరేట్), నార్కట్‌పల్లి, చిట్యాలరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కొర్రా లక్ష్మి ఆదేశించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలుగా నియమితులైన ఐఏఎస్ అధికారి, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కొర్రా లక్ష్మి గురువారం కలెక్టరేట్‌కు రాగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి పూల మొక్కతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్‌తో కలిసి ఆమె పరిశీలించారు. నార్కెట్‌పల్లిలో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రాన్ని, చిట్యాల మండలం వెలిమినేడులో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్, అభ్యర్థుల నామినేషన్ పత్రంతో పాటు సమర్పించాల్సిన ధ్రువపత్రాలను పరిశీలించి హెల్ప్‌డెస్క్ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఆర్వో గదులను, పోలింగ్ సామగ్రి, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. వారి వెంట అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా నియమితులైన ఆదిత్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, జిల్లా అబ్జర్వర్ల నోడల్ అధికారి, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రమేష్, ఎంపీడీవోలు కత్తురోజు ఉమేశ్‌చారి, జయలక్ష్మి, ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ, ఎంపీవో అనుముల కోటేష్ ఉన్నారు.



నల్లగొండలో ఎన్నికల ఏర్పాట్ల వివరాలను వివరిస్తున్న కలెక్టర్

కలెక్టర్ ఔదార్యం.. కళా మహోత్సవ్‌కు విద్యార్థినులు

- బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌కు జిల్లా నుంచి 50మంది విద్యార్థినులు
- రెండు బస్సుల్లో పయనం

7



కైలాష్‌పై మంత్రి కక్షసాధింపు మానుకోవాలి

బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ ప్రసన్నకుమార్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జేఏసీ చైర్మన్ ప్రసన్నకుమార్

నల్లగొండ టౌన్, నవబంరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన పున్నా కైలాష్‌నేతపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కక్షసాధింపు చర్యలు మానుకోవాలని బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గంగపుత్ర భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడిగా నియమితుడైన పున్నా కైలాష్‌పై మంత్రి వెంకట్‌రెడ్డి సీఎంకు రాసిన లేఖను తక్షణమే వెనక్కి తీసుకొని బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ నేత, బీసీ వర్గానికి చెందిన కైలాష్‌కు పదవి ఇవ్వడాన్ని జీర్ణించుకోలేని జిల్లా మంత్రి వెంకట్‌రెడ్డి, గతంలో చేసిన విమర్శను ప్రస్తుతం ప్రస్తావనకు తీసుకొచ్చి సీఎంకు లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పి.సైదులు మాట్లాడుతూ, బహుజన వర్గాలపై అణచివేత అధికమైతే తిరుగుబాటు తీవ్రమవుతుందన్నారు. బీసీ విద్యార్థి జేఏసీ జిల్లా చైర్మన్ అయితగోని జనార్ధన్ గౌడ్ మాట్లాడుతూ, బీసీ బిడ్డకు జిల్లా అధ్యక్ష పదవి దక్కితే ఓర్వలేక ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించడం తగదన్నారు. సమావేశంలో నాయకులు గజ్జి అజయ్‌యాదవ్, చెన్నూరి భరద్వాజ్‌యాదవ్, చిలకరాజు సతీష్‌కుమార్, మార్గం సతీష్‌కుమార్, కర్నాటి యాదగిరి, చిలకరాజు చెన్నయ్య, దుడ్డు కృష్ణమూర్తి, మల్లెబోయిన సతీష్‌యాదవ్, అనంత నాగరాజుగౌడ్, చీరబోయిన వెంకన్న, కల్లూరి సత్యనారాయణగౌడ్, అంబటి శివ, పులిపాటి జీవన్, బాతుక సతీష్ యాదవ్ యోగానంద్, తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో మాట్లాడుతున్న మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ వచ్చింది

- కేసీఆర్ వల్లే రాష్ట్ర ఏర్పాటు కల సాధ్యమైంది
- దీక్షా దివస్‌ను పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

7

ఎన్నికలు సజావుగా సాగేలా పని చేయాలి

ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అమిత్‌నారాయణ్

నల్లగొండ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సజావుగా సాగేలా ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేయాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు సమయ పాలనతో బాధ్యతలు నిర్వహించాలన్నారు. బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీములు, జోనల్ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు వాహనాలను సమకూర్చుకోవాలని అన్నారు.

తొలి రోజు ప్రశాంతంగా నామినేషన్లు

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలి రోజు నల్లగొండ, చండూరు డివిజన్లలో నామినేషన్లు ప్రశాంతంగా ముగిశాయని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, ఎంసీఎంసీ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మొదటి విడత నల్లగొండ, చండూరు డివిజన్లలోని 14 మండలాల్లోని 318 గ్రామపంచాయతీలకు సంబంధించి నామినేషన్లు స్వీకరించినట్లు తెలిపారు. జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పీవో, ఏపీవోలకు శిక్షణ ఇచ్చామని, ఎన్నికల నిర్వహణకు 285 రూట్ ఆఫీసర్లు, 177 మంది జోనల్ అధికారులను నియమించామన్నారు. అలాగే పోలింగ్ సిబ్బంది, అవసరమైన వాహనాలు, బ్యాలెట్ పేపర్లు, అన్ని రకాల సామగ్రిని సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జడ్పీ సీఈవో శ్రీనివాస్‌రావు, డీపీవో వెంకయ్య, వెంకటాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో సందడి





పంచాయతీ కార్యాలయాల్లో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఆ ప్రాంతాలన్నీ సందడిగా కనిపిస్తున్నాయి. నామినేషన్ల సమయంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఇద్దరు అభ్యర్థులు ఒకేసారి కార్యాలయంలోకి వెళ్లడం, రిటర్నింగ్ అధికారి వద్దే తప్పులు సరిచూసుకోవడం చేస్తున్నారు. ఎక్కువ సంఖ్యలో వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తూ ఫొటోలు దిగుతున్నారు.
(ఆంధ్రజ్యోతి-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి)

నిబంధనలు ఉల్లంగిస్తూ అధికసంఖ్యలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి వివిధ పార్టీల నాయకులు, అభ్యర్థులు

పంచాయతీ ఎన్నికల్లో గుర్తు.. గమ్మత్తు

- సర్పంచ్ అభ్యర్థులకు 30, వార్డు అభ్యర్థులకు 20 గుర్తుల కేటాయింపు
- గుర్తుల్లో చాయ్‌జాలీ, మూకుడు

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదటి విడత ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రారంభించారు. ఎన్నికల సంఘం సర్పంచ్ అభ్యర్థులకు 30, వార్డులకు 20 ఎన్నికల గుర్తులు కేటాయించింది. సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు వేర్వేరుగా ఎన్నికల గుర్తులు కేటాయించారు. సర్పంచ్ బ్యాలట్‌లో, వార్డు సభ్యుల బ్యాలెట్‌లో నోటా ఉంటుంది. సర్పంచ్ బ్యాలెట్ పేపర్ పింక్ కలర్‌లో, వార్డు సభ్యుల బ్యాలెట్ పేపరు వైట్ కలర్ ఉండనుంది.

సర్పంచ్ అభ్యర్థులకు

రింగు (ఉంగరం), కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడీస్ పర్సు, టీవీ రిమోట్, టూత్‌పేస్ట్, స్పానర్(పానా), చెత్త డబ్బా, బ్లాక్ బోర్డు, బెండకాయ, కొబ్బరితోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, చాయ్‌జాలీ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీలైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, పడవ, బిస్కెట్, ఫ్లూట్, చైన్, చెప్పులు, బెలూన్, స్టంప్స్ గుర్తులు కేటాయించారు.



సర్పంచ్ అభ్యర్థుల గుర్తుల్లో చాయ్‌జాలీ

వార్డు అభ్యర్థులకు

గౌను, గ్యాస్‌పొయ్యి, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, విజిల్ (ఈల), కుండ, డిష్ యాంటినా, గరాట(గౌర), మూకుడు, ఐస్‌క్రీమ్, గాజు గ్లాసు, పోస్టు డబ్బా, కవర్(ఎన్వలోప్), హాకీ స్టిక్ బాల్, నెక్‌టై, కటింగ్ ప్లేయర్, పెట్టె, విద్యుత్ స్తంబం, టీ కెటిల్ కేటాయించారు.

కొన్ని గుర్తులపై పెదవి విరుపు

సర్పంచ్, వార్డులకు కేటాయించిన ఎన్నికల గుర్తులపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇవేం గుర్తులని పెదవివిరుస్తున్నారు. అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు అక్షర క్రమంలో గుర్తులు కేటాయిస్తారు. తమకు ఏ గుర్తు వస్తుందో, గ్రామీణ ఓటర్లు దాన్ని సరిగా గుర్తిస్తారో లేదో నని మదన పడుతున్నారు. మంచం, టేబుల్, బ్లాక్‌బోర్డు, పలక, బిస్కట్ లాంటి వాటిల్లో కొన్నింటి పోలిక దగ్గరగా ఉంటుందంటున్నారు. స్టంప్స్, హాకీ స్టిక్ నిరక్షరాస్యులకు ఏం తెలుసని ప్రశ్నిస్తున్నారు.



వార్డు మెంబర్ల అభ్యర్థుల గుర్తుల్లో మూకుడు

నామినేషన్ డిపాజిట్లు ఇలా

సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ అయితే రూ.1000, ఇతరులలైతే రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.250, ఇతరులకు రూ.500 డిపాజిట్ చెల్లించాలి.

ఎన్నికల ఖర్చు పరిమితి దాటొద్దు

పంచాయతీ ఎన్నికల్లోనూ అభ్యర్థులకు వ్యయ పరిమితి విధించారు. 5వేల జనాభా పైబడిన గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.2.50లక్షలు, వార్డు అభ్యర్థులు రూ.50వేలు, 5 వేల జనాభా లోపు ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.1.50లక్షలు, వార్డు అభ్యర్థులు రూ.30 వేలకు మించి ఖర్చు చేయరాదు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై అధికారుల నిఘా ఉంటుంది.

లారీడ్రైవర్‌కు జైలు, జరిమానా

నిడమనూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అతివేగంగా లారీని నడిపి నలుగురి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి టీ.స్వప్న తీర్పు వెల్లడించారు. కోర్టు లైసన్ అధికారి అలీ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం 2017 జనవరి 2న నాగార్జునసాగర్ సమీపంలోని దయ్యాల గండి వద్ద ప్రమాదవశాత్తు గడ్డి ట్రాక్టర్ బోల్తా పడగా పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. ఆ సమయంలో సిమెంట్‌లోడుతో మాచర్ల నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీని డ్రైవర్ అతివేగంగా నడపి పలువురిని ఢీకొనడంతో ఇద్దరు పోలీసులతో పాటు మరో ఇద్దరు చనిపోయారు. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది గాయపడ్డారు. లారీ డ్రైవర్ డిండి మండలం పాంపాడ్‌కు చెందిన మాధవరం రామేశ్వర్‌రావుపై సాగర్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సోమ్లానాయక్ ఫిర్యాదు మేరకు విజయపురి టౌన్ పీఎస్‌లో కేసు నమోదు కాగా సాగర్ సీఐ పార్థసారధి, ఎస్ఐ గౌరీనాయుడు విచారణ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కాగా కోర్టులో గురువారం కేసు విచారించిన న్యాయమూర్తి స్వప్న నిందితుడి నేరం రుజువు కావడంతో ఏడాది జైలుశిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ సాధన వాదనలు వినిపించగా, కోర్టు పీసీ శేఖర్ విచారణకు సహకరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు, ఐదుగురికి జరిమానా

నల్లగొండ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడిపిన కేసులో నల్లగొండ కోర్టు ఒకరికి జైలుశిక్షతో పాటు ఐదుగురికి జరిమానా విధించినట్లు నల్లగొండ జిల్లా కేంద్ర ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య తెలిపారు. నల్లగొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా ఆరుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారిలో ఐదుగురికి రూ.4,500జరిమానా విధించగా మరొకరికి ఒక్కరోజు జైలుశిక్షతో పాటు రూ.500జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పిందన్నారు. పోలీసులు చేపడుతున్న వాహనాల తనిఖీలు ప్రజల ప్రాణ రక్షణ కోసమని, ప్రజలు పోలీసులకు సహరించాలని కోరారు.

దివ్యాంగులకు క్రీడా పోటీలు రేపు

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29 నుంచి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. జూనియర్ విభాగంలో అండర్-18, సీనియర్స్ విభాగంలో 18 నుంచి 54ఏళ్లలోపు వారికి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులకు చెస్, రన్నింగ్, షార్ట్‌పుట్, క్యార మ్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన వారిని హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు.. క్రీడల్లో పాల్గొనే వారు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని రావాలన్నారు.

మృతదేహం లభ్యం

నల్లగొండ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రామన్నపేట, చిట్యాల రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే ఎస్ఐ బీ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం 10.50 గంటల సమయంలో సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి రామన్నపేట-చిట్యాల రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు నుంచి జారీ కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండగా స్థానికులు సమాచారం అందించారని తెలిపారు. మృతుడు ఎత్తు 5.5 ఎత్తు, గుండ్రటి ముఖం, నలుపు రంగు, బట్టతల, తెల్లగడ్డం, వైట్ కలర్ షర్ట్ స్వచ్ఛభారత్ అని ఇంగ్లీషులో రాసి ఉన్నఆఫ్ వైట్ టీషర్ట్, కాళ్లకు శాండిల్స్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, నల్లగొండ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఏమైనా సమాచారం తెలిస్తే 8712 658595 ఫోన్ నెంబరుకు సమాచారం తెలపాలన్నారు.

పోరాడేవారిని గెలిపించాలి

మద్దిరాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని సీపీఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి పిలుపునిచ్చారు. మద్దిరాల మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల కార్యదర్శి పోలోజు సైదులు, నాయకులు కల్లెపల్లి భాస్కర్, దీకొండ ఉపేందర్, మల్లారెడ్డి, మల్లారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రకృతి ప్రసాదం

- పాఠశాల ఆవరణలో ప్రకృతి వ్యవసాయం

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని గురుకుల పాఠశాల చదువుతో పాటు జీవిత పాఠాలను నేర్పిస్తోంది. ఎలా బతకాలి, తమ పనులు తామే ఎలా చేసుకోవాలని నేర్పిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అదేసమయంలో నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించేందుకు పాఠశాల ఆవరణలోనే ప్రకృతి(ఆర్గానిక్) వ్యవసాయం చేయిస్తున్నారు. కూరగాయలు సాగు చేస్తూ వాటితోనే రుచికరమైన భోజనం అందిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)



ఆకుకూరలు కోస్తున్న సిబ్బంది



వరినాట్లు వేస్తున్న విద్యార్థులు, తూకం వేసిన కూరగాయలు

నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలె బీసీ గురుకుల పాఠశాలలో ఆర్గానిక్ గార్డెన్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఆహార పంటలపై అవగాహన కల్పిస్తూ, ఆర్గానిక్ ఎరువులతో ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. వాటితోనే ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారం విద్యార్థులకు అందిస్తున్నారు. ఆహార ఉత్పత్తుల కోసం రైతులు ఎంత కష్టపడి పండిస్తారో తెలుసుకోవడానికి ఈ కిచెన్ గార్డెన్ ఉపయోగపడుతోంది. ఈ గార్డెన్ సాగును ఉన్నతాధికారులు సైతం సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఎకరం స్థలంలో వరితో పాటు బెండ, గోకర కాయలు, మెంతి కూర, గోంగూర, పాల కూర, చుక్క కూర, బచ్చలి కూర, పుదీనా, కొతిమీర, తోట కూర, మిర్చి, బంతి పూల సాగు చేపట్టారు.

ప్రతిరోజూ ఆకుకూర పచ్చడి

ఆర్గానిక్ గార్డెన్‌లో చేపట్టిన కూరగాయల సాగుతో వచ్చిన పంటను ఏరోజు కారోజు వినియోగిస్తున్నారు. ప్రతి రోజూ సాయంత్రం భోజనంలో ఒక ఆక కూర పచ్చడి చేసి వడిస్తున్నారు. అంతేకాకుండా వారానికి 50 కిలోల పచ్చి మిరపకాలు దిగుబడి సాధిస్తున్నారు. అన్ని రకాల పంటల సాగును ఆర్గానిక్ పద్ధతిలోనే చేపడుతున్నారు. ఆకుకూరలు, కూరగాయల సాగులో ఆవు పేడతో పాటు చెట్ల ఆకులతో తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువులను, ఆహార పదార్థాల వ్యర్థాలను మాత్రమే వినియోగిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు.

సామాజిక బాధ్యత అలవర్చుకునేలా

పాఠశాలలో ఏ కార్యక్రమం జరిగినా గార్డెన్‌లో పెంచిన పువ్వులతో అలంకరిస్తున్నారు. అదేవిధంగా విద్యార్థుల పుట్టిన రోజులను వేడుకగా చేయడంతో పాటు పాఠశాల తరుపున మొక్కను అందజేసి, దానిని పెంచే బాధ్యతను విద్యార్థికి అప్పగిస్తున్నారు. దీంతో పాఠశాల ఆవరణ పచ్చదనంతో నిండిపోవడంతో మొక్కల పెంపకం, ప్రకృతి వ్యవసాయంపై అవగాహనతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకునేలా చేస్తున్నారు. గార్డెన్‌లో పండించిన పంటలతో నాణ్యమైన భోజనంతో పాటు ఖర్చు కూడా తగ్గిందని ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు.

ఆరోగ్యకర భోజనం అందిస్తున్నాం



పాఠశాల ఆవరణలోని గార్డెన్‌లో ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేపట్టాం. అక్కడ పండించిన ఆకుకూరలు, కూరగాయలతోనే నాణ్యమైన ఆరోగ్యకరమైన భోజనం అందిస్తున్నాం. పప్పులో ఏదో ఒక ఆక కూర వేసి వండిస్తున్నాం. అంతేకాకుండా రాత్రి భోజనంలో ఆకు కూర పచ్చడి ఉండేలా చూస్తున్నాం. బంతి పూల సాగుతో ఏ కార్యక్రమానికైనా బయట నుంచి పూలు కొనడం మానేశాం.

రవికుమార్, బీసీ గురుకుల ప్రిన్సిపాల్

రుచికరమైన కూరలు తింటున్నాం



పాఠశాల ఆవరణలో పండించిన ఆకుకూరలు, కూరగాయలతో చేసిన రుచికరమైన వంటలను తింటున్నాం. ప్రతి రోజూ నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారు.

జే అనిల్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి

అమ్మానాన్నల కష్టం తెలుస్తోంది



పాఠశాల ఆవరణలోని ఆర్గానిక్ గార్డెన్‌తో రైతులు, అమ్మానాన్నల కష్టం అర్థమవుతోంది. ఎంత కష్టపడి పండిస్తారో అని తెలవడంతో అమ్మ, నాన్నలు పడే కష్టం తెలుస్తోంది. చదువుతో పాటు సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం ఎలా చేయాలో నేర్చుకుంటున్నాం.

కే దినేష్, 8వ తరగతి, విద్యార్థి

కాంగ్రెస్ జెండా దిమ్మెలు ధ్వంసం

- తుప్రాన్‌పేట, దండుమల్కాపురం గ్రామాల్లో కూల్చివేసిన జాగృతి నాయకులు

చౌటుప్పల్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం, తూప్రాన్‌పేట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ దిమ్మెలను బుధవారం అర్ధరాత్రి తెలంగాణ జాగృతి కార్యకర్తలు ధ్వంసం చేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లలో తగ్గింపు నిర్ణయాన్ని నిరసిస్తూ జాగృతి నాయకురాలు కవిత ఇచ్చిన పిలుపు మేరకు మండల పరిధిలోని దండుమల్కాపురం, తూప్రాన్‌పేట గ్రామాల్లో అర్ధరాత్రి కాంగ్రెస్ పార్టీ దిమ్మెలను ఇతర ప్రాంతాలకు చెందిన జాగృతి కార్యకర్తలు ధ్వంసం చేశారు. స్థానిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జెండా దిమ్మెలను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కూల్చివేశారని భావించారు. తర్వాత పోలీసుల విచారణలో జాగృతి కార్యకర్తలు ధ్వంసం చేసినట్లుగా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ అయ్యాయి.

వీడియోల ఆధారంగా కొంత మంది జాగృతి కార్యకర్తలను ఇతర ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు. జెండా దిమ్మెల ధ్వంసంతో దండుమల్కాపురం, తూప్రాన్‌పేట గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయ. మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున గ్రామాలకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పబ్బు రాజు గౌడ్, తాడూరి వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెన్‌రెడ్డి రాజు పాల్గొన్నారు.



తుప్రాన్‌పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భక్తి శ్రద్ధలతో తిరుపతమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



బోనం సమర్పించేందుకు వెళ్తున్న వెల్లటూరు గ్రామస్థులు

మేళ్లచెర్వు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం నూతన వెల్లటూరు గ్రామంలో లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య విగ్రహప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు పూర్ణకలశాలతో గ్రామసేవ సాగించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో ప్రతిష్ఠాపన జరిగింది. పండుగను ఆనందోత్సహాల మధ్య జరుపుకున్నారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లులో ప్రమాదం

బూడిద తీస్తుండగా కూలీలకు గాయాలు

హుజూర్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులోని సాయిబాలాజీ రైస్‌మిల్లులో ప్రమాదం చోటుచేసుకుంది. వరి పొట్టు బూడిదను లారీలోకి లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కూలీలపై బూడిద గుట్ట కుప్పకూలింది. ఈ ప్రమాదంలో కోదాడ మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన సాధినేని దుర్గ, షేక్ ఫిరోజ్, జాన్‌బీ, షేక్ సైదాలపై బూడిదపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారికి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. రైస్‌మిల్లులో బూడిదను చల్లార్చకుండా లారీలోకి లోడ్ చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు గాయపడ్డ కూలీలు తెలిపారు. కాగా ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితులను ఆదుకోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు.



గాయపడ్డ మదార్

మెడికల్ కళాశాలకు పార్థివదేహం అప్పగింత

నల్లగొండ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేంద్రంలోని వైద్యకళాశాలకు ఓ వ్యక్తి మృతదేహాన్ని అప్పగించేందుకు వారి కుటుంబ సభ్యులు ముందుకువచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన బాలగోని శ్రీనివాస్‌గౌడ్(43) బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలియడంతో కాలనీవాసులు కుటుంబసభ్యులను పరామర్శించి శ్రీనివాస్ పార్థివ దేహాన్ని నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు దానం చేసేందుకు ఒప్పించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ ఐకాన్ సహకారంతో డాక్టర్ పుల్లారావు ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల బాధ్యులను సంప్రదించారు. పార్థివదేహం స్వీకరణకు అంగీకరించడంతో అప్పగించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల అనాటమీ విభాగంలో హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ పుష్పమాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ అమీరా అప్రోజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, బుట్టేడి వీరారెడ్డి, పంతులు శ్రీనివాస్, సింగం రాంమోహన్, సోమగాని శంకర్‌గౌడ్, మర్రి మహేందర్‌రెడ్డి, ముప్ప రేవన్ రెడ్డి, రాములు, ఉదయ్ కుమార్, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలోని మెడికల్ కళాశాల అధికారులకు అంగీకారపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ సభ్యులు



పింఛన్ కోసం బారులు

కొండమల్లేపల్లి : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామంలో పింఛన్ కోసం బారులు తీరిన వృద్ధులు. ప్రతి నెలా సక్రమంగా పింఛన్ ఇవ్వడం లేదన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తపాలాసిబ్బంది జహంగీర్ గురువారం నుంచే పంపిణీని ప్రారంభించారు. దీంతో 100 మందికి పైగా పింఛన్ డబ్బుల కోసం బారులు తీరారు.

రైల్వే కమాన్‌ను ఢీకొట్టిన లారీ

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు రైల్వేట్రాక్ వద్ద నిర్మించిన ఇనుప కమాన్‌ను గురువారం ఢీకొట్టింది. చిట్యాల మండలం పిట్టంపల్లి నుంచి మిర్యాలగూడ మండలం వెంకటాద్రి పాలెం గ్రామంలోని సూర్యానారాయణ రైస్‌మిల్లుకు లారీలో ఐకేపీ ధాన్యం తీసుకెళ్తున్నారు. ధాన్యం హెవీలోడ్‌తో వెళ్తున్న లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ఎత్తు తక్కువగా ఉన్న కమాన్‌ను తాకడంతో రోడ్డుకు అడ్డంగా కుప్పకూలి పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి సుమారు గంటపాటు ట్రాఫిక్ జామ్ అయింది. లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా పడిపోయిన కమాన్‌ను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు.



కూలిపడిన ఇనుప కమాన్

పట్టుదలతో లక్ష్యం వైపు అడుగులు

» సినీ రంగంలో రాణిస్తున్న జాన్‌జక్కీ » సందేశాత్మక చిత్రాలు తీస్తా

తాను అనుకున్న సినిమా రంగంలో తనదైన ముద్ర వేసుకొని ముందుకు సాగుతున్నాడు సూర్యాపేట జిల్లా సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల వల్లాబాపురం గ్రామానికి చెందిన జాన్ జక్కీ అలియాస్ జక్కి కనకయ్య. చిన్నతనం నుంచే కష్టాలు ఎదురైనా అనుకున్న లక్ష్య మే ముందు కన్పించింది. ఎక్కడా రాజీపడకుండా ఒక్కో మెట్టు ఎక్కుతూ లక్ష్యం వైపు వెళ్తున్నాడు.



దర్శకత్వం వహిస్తున్న జక్కిజాన్

\- ఆంధ్రజ్యోతి, సూర్యాపేట టౌన్

జాన్‌జక్కి చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయాడు. కుటుంబంలో ముగ్గురు అక్కల తర్వాత అందరికన్నా చిన్నవాడు జాన్‌జక్కి. మూడో అక్క దగ్గర ఉంటూ చదువు సాగించాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఉంటూ ఫొటోగ్రఫీ నేర్చుకోవడంతో పాటు సాయంత్రం వైన్స్‌షాప్‌లో వర్కర్‌గా పనిచేశాడు. తర్వాత హైదరాబాద్‌లో ఫొటోగ్రాఫ్ షాప్‌లో పనిచేస్తూ ఈవెంట్లకు వీడియో తీసేవాడు.

దశ తిప్పిన వీడియో టేకింగ్

జక్కిజాన్ హైదరాబాద్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌కు వీడియో తీశాడు. వీడియో తీసిన విధానం నచ్చిన ఫంక్షన్ నిర్వాహకుడు సినిమా రంగానికి చెందిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తికి పరిచయం చేయించాడు. దీంతో చిన్న చిన్న సినిమాలకు ఎడిటింగ్ చేయడం ప్రారంభించాడు. ఆ తర్వాత వసుంధర నిలయం అనే డాక్యుమెంటరీ తీశాడు. తర్వాత సంధ్య మోషన్ ఫిక్చర్ అనే సంస్థతో కలిసి చిన్నచిన్న సినిమాలకు ఎడిటింగ్ చేసే పూర్తిగా నిమగ్నమయ్యాడు. అదే సమయంలో 2015లో కల్యాణలక్ష్మి అనే యాడ్ తీశాడు. అదేవిధంగా దాపిని అనే చిన్న సినిమా డైరెక్ట్ చేశాడు.

ఆ సినిమా మధ్యలోనే ఆగిపోయింది. దీంతో డిప్రెషన్‌లోకి వెళ్లిన జక్కిజాన్ కొద్దిరోజుల్లోనే కథను రాసుకొని 2022లో గోల్‌మాల్ 2020 అనే సినిమా తీశాడు. ఈ చిత్రం ఆదరణ పొందింది. తర్వాత లాక్‌డౌన్ విరామం తర్వాత మాత్ర అనే భారీ బడ్జెట్ సినిమాను తీశాడు. తెలుగు, తమిళ సినిమా రంగానికి చెందిన ప్రముఖ హీరో శ్రీరామ్‌తో పాటు పేరు పొందిన నటీనటులకు దర్శకత్వం వహించాడు.



సందేశాత్మక చిత్రం తీయడమే లక్ష్యం



సమాజంలో మార్పు తెచ్చేలా సందేశాత్మక చిత్రం తీయడమే లక్ష్యం. వాణిజ్య విలువలతో పాటు సందేశాత్మక చిత్రం భవిష్యత్‌లో తీస్తా. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ అనుకున్న లక్ష్యం సాధించాలి. జీవితం ఎప్పుడూ పూలబాటలా ఉండదు కష్టపడుతూ ముందుకుసాగాలి.

\- జక్కిజాన్, దర్శకుడు

జీవిత పాఠాలే ఆయన కథనాలు

» గ్రామీణ వ్యక్తుల జీవితాలే ఇతివృత్తాలుగా రచనలు
» పలు టీవీ సీరియళ్లకు రచయితగా దొంగరి మహేందర్
» బుల్లితెర సీరియల్స్‌కు కథలు, మాటలు రాస్తూ గుర్తింపు

గ్రామీణ వ్యక్తుల జీవితాలే ఆయన కథలు. తన చుట్టూ కనిపిస్తున్న వ్యక్తుల జీవితాలను చూసిన ఆయన కవితలు, కథలు రాయడం అలవాటు చేసుకున్నాడు. పదుల సంఖ్యలో బుల్లితెర టీవీ సీరియల్స్‌కు రచయితగా గుర్తింపు తెచ్చుకుంటున్నాడు సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ గ్రామానికి చెందిన దొంగరి మహేందర్.



షూటింగ్ సెట్‌లో దొంగరి మహేందర్

\- ఆంధ్రజ్యోతి, పెన్‌పహాడ్

సినిమా రంగంపై ఆసక్తి ఉన్న మహేందర్ 2005లో హైదరాబాద్‌కు వెళ్లి దర్శకులు దాసరి నారాయణరావు, తేజ వద్ద అసిస్టెంట్ సినిమా రచయితగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. వీరి సహకారంతో మొదటిసారిగా ఈ టీవీ ఈ తరం ఫిల్మ్స్‌లో రచయితగా పది సంవత్సరాల పాటు పనిచేశాడు. బుల్లితెర రచయితగా మొదటిసారి ఈ టీవీలో 2014లో 'అడదే ఆధారం' అనే సీరియల్‌కు కథ, మాటలు రాశారు. ఆ సీరియల్ ఈ టీవీలో ఎక్కువ రోజులు వచ్చింది. దీంతో మహేందర్‌కు మంచి పేరు తెచ్చిపెట్టింది. 2015లో మీనాక్షి, 2020లో అమ్మ, 2016లో గోకులంలో సీత, 2021లో అభిషేకం, 2022లో స్వాతి చినుకులు,2022లో లాహిరి లహిరి, 2023లో శతమానం భవతి, 2025లో సంధ్యారాగం వంటి సుమారుగా 20కి పైగా సీరియళ్లకు మహేందర్ రచయితగా పనిచేశారు. ఈ టీవీ తో పాటుగా జెమిని టీవీలో అవకాశం రావడంతో జెమిని టీవీకి కూడా సీరియల్ రచయితగా రాణిస్తున్నాడు. జెమిని టీవీలో వస్తున్న పౌర్ణమి,తాళి, మట్టిగాజులు, అంతులేనికథ, అమ్మోరు వంటి సీరియల్స్‌కు రచయితగా పనిచేశాడు. ప్రస్తుతం అమ్మోరు సీరియల్ షూటింగ్ దశలో ఉండగా మిగతా సీరియల్స్ జెమిని టీవిలో ప్రసార అవుతున్నాయి. మా టీవీలో ఆమె కథ(2023), కథలో రాజకుమారి(2024), వంటి సీరియల్స్‌కు రచయితగా పనిచేశారు. జీ టీవీలో వస్తున్న లక్ష్మీనివాసం (2025), రౌడీ గారి పెళ్లాం(2024), అడవాళ్లు మీకు జోహార్లు(2023) వంటి సీరియల్స్ కూడా మహేందర్ రచయితగా పని చేశారు.

వేణుగోపాల్‌రెడ్డి జీవితంపై డ్యాకుమెంటరీ

మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, అమరుడు కొండేటి వేణుగోపాల్ జీవితంపై జనవరి 19 'చరిత్రలో ఒక రోజు అనే టైటిల్ తో ఒక డ్యాకుమెంట్ తీసి మాజీ సీఎం కేసీఆర్ చేత ప్రశంసలు పొందాడు దొంగరి మహేందర్. వీటితో పాటుగా 'పాప వినాశనం' అనే ఒక డెమో ఫిలింకు కథ, మాటలు, దర్శకత్వం వహించాడు. ప్రస్తుతం ఇది య్యూటూబ్‌లో ట్రెడింగ్‌లో ఉన్న ఒక డెమో ఫిలింగా గుర్తింపు పొందింది. ఈ టీవీలో రోజువారీగా ప్రచారమవుతున్న సంధ్యారాగం, జెమినీ టీవీలో అమ్మోరు అనే సీరియల్స్‌కు దొంగరి మహేందర్ కథ, స్కీన్‌ప్లే, మాటలు రాశారు.

సినిమా దర్శకత్వం ప్రయత్నాలు జరుగుతున్నాయి



గ్రామీణ స్థాయి నుంచి వ్యక్తుల జీవితాలను కథ వస్తువులు చేసుకొని రచయితగా మారాను. ప్రముఖ టీవీ ఛానల్స్ ప్రసారమవుతున్న సీరియల్స్‌కు స్వయంగా కథ, మాటలు రాస్తున్నాను. మంచి దర్శకుడిగా పేరు తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాను.

\- దొంగరి మహేందర్, బుల్లితెర రచయిత.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	582 అడుగులు
ఎడమకాల్వకు నీటి విడుదల	3972 క్యూసెక్కులు
కుడికాల్వకు	9500క్యూసెక్కులు
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
సాగర్‌కు నీటి రాక	15,272 క్యూసెక్కులు
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
వరద కాల్వ	నిల్
అవుట్‌ఫ్లో	15,272 క్యూసెక్కులు
మొత్తం గేట్లు	నిల్

\- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.88 టీఎంసీలు
నీటి రాక	1000 క్యూసెక్కులు
నీటి విడుదల	8000 క్యూసెక్కులు

\- చింతలపాలెం

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	644.30 అడుగులు
నీటి రాక	988.76 క్యూసెక్కులు
గేట్ల ద్వారా విడుదల	నిల్
నీటి విడుదల	1032.24 క్యూసెక్కులు

\- కేతేపల్లి

శాలిగౌరారం ప్రాజెక్ట్

పూర్తిస్థాయి నీటి మట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	20 అడుగులు
నీటి రాక	నిల్
నీటి విడుదల	నిల్

\-శాలిగౌరారం

హోరాహోరీగా జాతీయస్థాయి క్రీడా పోటీలు

● సెయింట్ జోసప్స్ సీసీఆర్ విద్యానిలయంలో 19వ సీఎస్‌ఏ క్రీడా పోటీలు



పరుగుపందెం ప్రారంభిస్తున్న ఉపాధ్యాయురాలు

కోదాడటౌన్, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని సెయింట్ జోసప్స్ సీసీఆర్ విద్యా నిలయంలో నిర్వహించిన 19వ సీఎస్‌ఏ జాతీయ స్థాయి క్రీడా పోటీలు, రెండో రోజు గురువారం ఉత్సాహంగా పోటాపోటీగా జరిగాయి. ప్రిన్సిపాల్ జ్యోతి పర్యవేక్షణలో క్రీడల కన్వీనర్ సిస్టర్ ఉడుముల శౌరీ, కరస్పాండెంట్ సిస్టర్ నక్షత్రం రెండో రోజు క్రీడలను ప్రారంభించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, అథ్లెటిక్స్‌లోనూ క్రీడాకారులు సత్తా చాటారు. జాతీయ స్థాయి ఇటువంటి క్రీడలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, స్నేహభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందేందుకు ఉపయోగపడతాయని కన్వీనర్ ప్రొవెన్షియల్ మంగళగిరి, ఉడుముల శౌరీ తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ కర్ణాటక, తమిళనాడు నుంచి వచ్చిన విద్యార్థులు ఒకే వేదికపై తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. క్రీడలను చూసేందుకు ప్రేక్షకులు భారీగా పాఠశాలకు తరలిరావడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.

30న జానకీపురంలో కబడ్డీ జిల్లా బాలుర జూనియర్ ఎంపిక

ఆలేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకిపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 30న కబడ్డీ బాలుర జూనియర్స్ జిల్లా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య స్థానిక విలేకరులతో తెలిపారు. ఈ ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు 2006 జనవరి తర్వాత జన్మించి, 20ఏళ్ల వయస్సులోపు, 75కిలోల లోపు బరువు ఉండాలని తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు వెంట ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో వెంట తీసుకుని రావాలన్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయం ఉందని తెలిపారు. ఉదయం 9 గంటల వరకు మైదానానికి చేరుకోవాలని నాగయ్య తెలిపారు.

కోదాడ విద్యార్థికి అంతర్జాతీయ గుర్తింపు

కోదాడటౌన్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక ప్రతిష్టాత్మకంగా ఈనెల 30వ తేదీన ఆన్‌లైన్‌లో ప్రతిష్టాత్మకంగా 13 గంటల పాటు బాల సాహిత్య భేరి పేరుతో అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనం నిర్వహించనుంది. ఈ విశేషమైన కార్యక్రమంలో పాల్గొనటానికి తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా, కోదాడ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థి సోమ రమేష్ (10వ తరగతి) ఎంపికైనట్లు ఎంఈఓ సలీంషరీఫ్ తెలిపారు. కథ, వచన, కవిత, గేయం, పద్యం, విభాగాల్లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు విద్యార్థులు 101 మంది కార్యక్రమంలో పాల్గొంటారు. రమేష్ కథా విభాగంలో ఎంపికయ్యాడు. రమేష్ మూడు నిమిషాల పాటు కథ వినిపించనున్నాడు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు డి.మార్కండేయ, తెలుగు భాష ఉపాధ్యాయులు వీరబ్రహ్మాచారి, ముక్కామల జానకిరామ్, చిన్నప్ప, ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్‌లర్లు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, ప్రఖ్యాత బాల సాహితీవేత్తలు, జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొంటున్న ఈ కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థినికి అరుదైన అవకాశం కల్పించిన తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలికి తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్, సమన్వయ కర్త చిగురుమళ్ల శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.



రమేష్

ఒలంపియాడ్ ఎడ్యుక్వెస్ట్‌కు కోదాడ విద్యార్థులు

కోదాడటౌన్, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): సీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈఎల్‌టీఏ(ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్) కోదాడ ఆధ్వర్యంలో కోదాడ మండలస్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్, ఎడ్యుక్వెస్ట్ కాంపిటేషన్ నిర్వహించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కాంపిటీషన్లో ఒలంపియాడ్ సీనియర్స్‌లో కే.పూజశ్రీ, జూనియర్స్‌లో అన్నా ఫాతిమా ఎడ్యుక్వెస్టులో సినియర్స్‌లో కె.పూజ, జూనియర్స్‌లో ఎస్‌కె షైమూనా ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయిలో నిర్వహించే తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్, ఎడ్యుక్వెస్ట్‌కు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఈల్టా సూర్యాపేట జిల్లా కార్యదర్శి షహనాజ్, కోదాడ మండల కన్వీనర్ కడారు రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు ఇ.శ్రీనివాస్‌రెడ్డి, బి.కనకమ్మ, జి.సైదయ్య, బి. సైదులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

కలెక్టర్ ఔదార్యం.. కళా మహోత్సవ్‌కు విద్యార్థినులు

● బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌కు జిల్లానుంచి 50మంది విద్యార్థినులు ● రెండు బస్సుల్లో పయనం ● బస్సులు, అల్పాహారం, భోజనం, స్నాక్స్ ఏర్పాటు

నల్లగొండటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని బొల్లారంలో ఉన్న రాష్ట్రపతి నిలయంలో అదేవిధంగా ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవ్‌కు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల నుంచి 50మంది విద్యార్థినులను పంపించారు. చదువే అన్నింటికీ మూలమని, చదువుతోనే అభివృద్ధి సాధ్యమని విశ్వసించే నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తాను జిల్లాలో ఎక్కడ పర్యటించినా ముందుగా పాఠశాలలు, కేజీబీవీలను సందర్శిస్తారు. ప్రత్యేకించి విద్యార్థినుల విద్యా సామర్థ్యాన్ని పరిశీ లిస్తారు. వారికి ప్రశ్నలు వేసి జవాబులు రాబడతారు. తర్వాత చాక్లెట్లు ఇచ్చి ఉత్సాహం నింపు తారు. ఇందులో భాగంగా పదో తరగతిలో ఉత్తమ గ్రేడ్లు సాధించిన విద్యార్థినులను తన సొంత ఖర్చుల తో విమానంలో విహారయాత్రకు పంపిన విషయం తెలిసిందే. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి విద్యార్థినిలు వెళ్లే ప్రత్యేకంగా రెండు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతోపాటు, భారతీ య సంస్కృతి, సాంప్రదాయాలు, కళలు, తదితర అంశాల్లో ప్రావిణ్యం సాధించేందుకు ప్రోత్సహించాల న్నారు. అందుకే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీల నుంచి విద్యార్థినులను ఎంపిక చేసి కళా మహోత్సవ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. బస్సులతో పాటు అల్పాహారం, భోజనం, సాయంత్రం స్నాక్స్ వంటివి ఏర్పాటు చేశారు. బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన విద్యార్థులు అక్కడి రోజ్‌గార్డెన్, రాక్, నక్షత్ర, హెర్బల్ ఉద్యాన వనాలు, ఫొటో గ్యాలరీ, యోగ జోన్, మ్యూజికల్ ఫౌంటేన్లు, చిల్డ్రన్స్ పార్క్, 120ఫీట్ల ఎత్తైన ఫ్లాగ్, 150 సంవత్సరాల టాకింగ్‌ట్రీని చూసి అనుభూతి పొందారు.



కళా మహోత్సవ్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న విద్యార్థినుల బస్సుకు జెండా ఊపుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

● మాజీమంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు, దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు మూలమలుపైన రోజు నవంబరు 29వ తేదీ అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. బీఆర్ఎస్ అనేది పుట్టకపోతే తెలంగాణ రాష్ట్రం లేదని, అందుకే ప్రతి తెలంగాణ వ్యక్తి ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నాలన్నారు. సమైక్య పాలనలో తెలంగాణ అనే పదం పలకాలంటే భయపడే రోజుల్లో కేసీఆర్ తన పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేసి ప్రజల్లోకి తెలంగాణ నినాదాన్ని తీసుకెళ్లారన్నారు. కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రే కాకుండా, తెలంగాణ తెచ్చిన ముఖ్యమంత్రిగా నేటి తరానికి తెలియజేయాలన్నారు. మోదీ, చంద్రబాబు, రేవంత్ లాంటి వారు ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్‌ను ఏమీ చేయలేరన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెండేళ్లుగా సమైక్య పాలన సాగుతోందన్నారు. చంద్రబాబు ఏజెంట్ ఇక్కడ అక్కడి ప్లాన్‌లను అమలు చేస్తున్నారన్నారు. విలువైన భూములను ఆంధ్ర ప్రాంతం నేతల వద్ద కమీషన్ తీసుకొని వారికి భూములను ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కూసు కుంట్ల ప్రభాకర్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, నోముల భగత్, నాయకులు చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్, రేగట్టే మల్లికా ర్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, ప్రసన్న రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ

దేవరకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్ వెళుతున్న బస్సులో రూ.1.10లక్షల విలువజేసే ఐఫోన్‌ను ప్రయాణికురాలు గురువారం బస్సులో మర్చిపోయి హైదరాబాద్ కర్మన్‌ఘట్ స్టేజీ వద్ద దిగిపోయారు. గమనించిన కండక్టర్ వనం యాదగిరి, డ్రైవర్ మహమ్మద్ అలీలు ప్రయాణికురాలు మర్చిపోయిన ఫోన్‌ను భద్రపరిచి దేవరకొండ ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో విచారణ జరిపిన డిపో మేనేజర్ సైదులు ప్రయాణికురాలు మర్చిపోయిన ఫోన్‌ను గుర్తించారు. డ్రైవర్, కండక్టర్లు నిజాయితీగా ప్రయాణికురాలికి ఫోన్‌ను అప్పగించారు. దీంతో డిపో మేనేజర్ సైదులు డ్రైవర్, కండక్టర్‌లను అభినందించారు.




ప్రయాణికురాలికి ఫోన్ అప్పగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

కనగల్‌లో ఒకే రోజు మూడు సాధారణ ప్రసవాలు

కనగల్, నవంబరు 27:(ఆంధ్రజ్యోతి) నల్లగొండ జిల్లా కనగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఒకే రోజులో మూడు సాధారణ కాన్పులు జరిగాయి. రెండు రోజుల వ్యవధిలో నాలుగు కాన్పులు చేశారు. కనగల్ గ్రామానికి చెందిన బుర్రి రేణుకా, ఎస్‌లింగోటం గ్రామాలకు చెందిన ఆలకుంట్ల రేణుకా, ఐతగోని శిరీష పురిటినొప్పులతో బుధవారం పీహెచ్‌సీలో చేరారు. డాక్టర్ రామకృష్ణ, రమణారెడ్డి పర్యవేక్షణలో స్టాఫ్ నర్స్ కవిత వైద్య సిబ్బంది గర్భిణులకు చికిత్స అందించారు. ఈ ముగ్గురికీ ఆడ శిశువులు జన్మించారు. ప్రసవాల అనంతరం తల్లులు, శిశువులు ఆరోగ్యంగా ఉండటంతో వారి బంధువులు, కుటుంబసభ్యులు డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైడూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణ తంతు నిర్వహించారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారలను సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్ర హవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 18,33,0552 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

పరిశీలిస్తూ.. పర్యవేక్షిస్తూ..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు కొండపైన గురువారం పరిసరాలు పరిశీలించారు. ముందుగా ప్రధాన కార్యాలయం ఎదురుగా పోలీసు కంట్రోల్ రూం పరిశీలించి సీసీ కెమెరాల మానిటరింగ్ సిస్టం, సెక్యూరిటీ వ్యవస్థ వాటి పనితీరు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ వేళల్లో పకడ్బందీ భద్రత చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రసాదాల తయారీ, క్రయవిక్రయాల కేంద్రాలు, ఉచిత ప్రసాద వితరణ పంపిణీ విధానాన్ని కొద్దిసేపు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యంగా, సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్యశాలను సందర్శించి వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర వైద్యం అందించేందుకు వైద్య సదుపాయాలు అందుబాటులో బలోపేతం చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.



కంట్రోల్ రూంలో కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఈవో వెంకట్రావు

పల్లెల్లో నామినేషన్ల సందడి

● 318 సర్పంచ్ పదవులకు 421 నామినేషన్లు, 2870 వార్డులకు 234 నామినేషన్లు దాఖలు ● 117 క్లస్టర్ కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ



నార్కట్‌పల్లిలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి కొర్ర లక్ష్మీ, కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీ తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో నామినేషన్ల పర్వం మొదలైంది. గురువారం ఉదయం ఆయా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేసి అప్పటి నుంచి నామినేషన్లు స్వీకరించారు. జిల్లాలో తొలివిడతలో నల్లగొండ, చండూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 318 గ్రామపంచాయతీల్లో సర్పంచ్ పదవులకు, 2870 వార్డు సభ్యుల పదవులకు పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. పోటీచేయాలనే ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించే ఉద్దేశంతో 117 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు సహాయం నిమిత్తం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. నామినేషన్ పత్రాలను పరిశీలించి తప్పొప్పులుంటే సరిచేసుకోవాలని హెల్ప్‌డెస్క్‌ల ద్వారా సూచిస్తున్నారు. జిల్లాలో మొదటి రోజు గురువారం సప్తమి కావడంతో శుభగడియగా భావించిన అభ్యర్థులు పలువురు ఉత్సాహంగా, ర్యాలీలతో సహా వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. 318 సర్పంచ్ పదవులకు గాను 421నామినేషన్లు దాఖలవగా, 2870 వార్డులుకు గాను 234 నామినేషన్లు గురువారం దాఖలయ్యాయి. నామినేషన్లు దాఖలు చేసే క్లస్టర్ పాయింట్ల వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న క్లస్టర్లను ఎన్నికల పరిశీలకురాలు సీనియర్ ఐఏఎస్ అధికారి కొర్రలక్ష్మీ, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సందర్శించారు. అంతకుముందు ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సమీక్ష జరిపారు. నార్కట్‌పల్లి, వెలిమినేడు క్లస్టర్లను పరిశీలించారు.

జిల్లాలో తొలిరోజు నామినేషన్లు ఇలా..

మండలం	గ్రామం	సర్పంచ్	వార్డులు	నామినేషన్లు
చండూరు	19	29	166	21
చిట్యాల	18	29	180	21
గట్టుప్పల్	7	10	68	4
కనగల్	31	44	262	7
కట్టంగూరు	22	23	206	21
కేతేపల్లి	16	31	160	10
మర్రిగూడ	18	21	170	9
మునుగోడు	28	33	244	20
నకిరేకల్	17	21	160	11
నల్లగొండ	31	25	270	16
నాంపల్లి	32	27	276	16
నార్కట్‌పల్లి	29	47	262	43
శాలిగౌరారం	24	34	230	10
తిప్పర్తి	26	47	216	25
మొత్తం	318	421	2870	234

గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్):

● కట్టంగూరు మండలంలో 23మంది సర్పంచ్ అభ్యర్థులు, వార్డులకు 21మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో పెరుమాళ్ల జ్ఞాన ప్రకాశ్‌రావు తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ కట్టంగూరు, అయిటిపాముల నామినేషన్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సతీష్, రిటర్నింగ్ అధికారి కవిత, ఎంపీవో స్వరూపరాణి, పుట్ల రాములు, కవిత, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

● నకిరేకల్ మండలంలో సర్పంచ్ కోసం 21, వార్డు మెంబర్ల కోసం 11 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో వెంకటేశ్వ ర్‌రావు తెలిపారు.

● తిప్పర్తి మండలంలో సర్పంచ్ అభ్యర్థులుగా 47మంది, 25మంది వార్డు సభ్యులుగా నామినేషన్లు దాఖలు చేసినట్ల ఎంపీడీవో సుధాకర్ తెలిపారు. ఈ నెల 29న నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు.

● నార్కట్‌పల్లి మండలంలో తొలిరోజు సర్పంచ్ స్థానాలకు 47, వార్డు స్థానాలకు 43 నామినేషన్లు దాఖలయ్యాయి.



నల్లగొండ మండలం దోమపల్లి నామినేషన్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

● కేతేపల్లి మండలంలో తొలిరోజు 31మంది సర్పంచ్ అభ్యర్థులు, 10 మంది వార్డులకు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో పరిస్థితిని ఎంపీవో నాగలక్ష్మి, ఎంపీడీవో బి. శ్రీనివాసరావు పరిశీలించి క్లస్టర్‌లలో స్టేజ్1- రిటర్నింగ్ ఆఫీసర్లకు సూచనలు చేశారు.

● నాంపల్లి మండలంలో తొలిరోజు సర్పంచ్‌లకు 27మంది నామినేషన్‌లు దాఖలు చేశారని ఎంపీడీవో రామకృష్ణశర్మ తెలిపారు.

● కనగల్ మండలంలో తొలిరోజు సర్పంచ్ స్థానాలకు 41, వార్డులకు ఏడు నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి (ఎంపీడీఓ) వేద రక్షిత తెలిపారు.

● చండూరు మండలంలో 25సర్పంచ్, 19వార్డులకు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

చిట్యాల మండలంలో మొదటిరోజు సర్పంచ్‌కు 28, వార్డులకు 21 నామినేషన్ల దాఖలయ్యాయి.

● మునుగోడు మండలంలో 33 సర్పంచ్ నామినేషన్లు సమర్పించారు. 20 వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలోని పులిపల్పుల పలివెల క్లస్టర్లను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పరిశీలించారు.

నల్లగొండ మండలంలో తొలిరోజు 25 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో యాకూబ్ నాయక్ తెలిపారు.

● మర్రిగూడ మండలంలో 21 మంది సర్పంచ్ అభ్యర్థులు మొదటిరోజు నామినేషన్లు దాఖలు చేశారు. 9 మంది వార్డు మెంబర్లకు నామినేషన్ వేసినట్లు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీడీవో మున్నయ్య తెలిపారు.

● శాలిగౌరారం 34మంది సర్పంచ్ పదవులకు, 10మంది వార్డు పదవులకు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి తెలిపారు.

పొత్తుల పంచాయతీలు

(5వ పేజీ తరువాయి)

తామెలాంటి ఆర్థిక మద్దతు ఇవ్వలేమని, గెలిచివచ్చాక అభివృద్ధికి అవసరమైన నిధులు మాత్రం కోరినంత ఇప్పిస్తామని స్పష్టం చేస్తుండడతో కొందరు ఆశావహులు పోటీకి వెనకంజవేస్తున్న పరిస్థితి ఉంది. గ్రామాల్లో మంచిపేరు ఉన్నా, ఆర్థికంగా ఖర్చుపెట్టే స్థోమత లేక అవకాశాలు వదులుకునేందుకు కొందరు క్రియాశీలక నాయకులు సిద్ధమవడంపై పార్టీలో చర్చ సాగుతోంది.

కలిసొచ్చే పార్టీలతో బీఆర్ఎస్

కాంగ్రెస్‌ను స్థానిక సమరంలో నిలువరించాలనే పట్టుదలతో ఉన్న బీఆర్ఎస్ నాయకత్వం పంచాయతీ ఎన్నికల్లో బలమైన పోటీకి సిద్ధమవుతోంది. అదే సమయంలో స్థానికంగా ఆయా గ్రామాల్లో ఓటుబ్యాంకు, నాయకత్వం ఉన్న బీజేపీ, సీపీఎంతో కలిసి సీట్లను సర్దుబాటు చేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. సర్పంచ్‌లుగా బీఆర్ఎస్ అభ్యర్థులు బరిలో ఉంటే, ఉపసర్పంచ్‌లుగా బీజేపీ అభ్యర్థులకు, సీపీఎం బలంగా ఉన్న చోట్ల వారికి ఇవ్వాలని చర్చిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఇలాంటి ప్రతిపాదనలతో ఇరుపార్టీల స్థానిక క్యాడర్ మధ్య చర్చలు సాగుతున్నాయి. అదేవిధంగా వార్డుల్లోనూ పొత్తుల ద్వారా వెళ్లాలని భావిస్తున్నారు. నల్లగొండ నియోజకవర్గంలోని ఒక మండలంలో సీపీఎం మూడు సర్పంచ్ సీట్లు, అన్ని పంచాయతీల్లో కొన్నివార్డు స్థానాలు, కొన్ని గ్రామాల్లో ఉపసర్పంచ్ పదవులను, భవిష్యత్‌లో జరిగే ఎంపీటీసీ స్థానాల్లో కొన్నింటిని చర్చల్లో ప్రతిపాదించినట్లు సమాచారం. ఇంకా అధికారికంగా సీట్ల సర్దుబాటు కాలేదని, కలిసి పోటీచేయడానికి అంగీకారానికి వచ్చినట్లు క్యాడర్‌లో చర్చ సాగుతోంది.

ఆర్థికబలం లేక వెనకంజవేస్తున్న క్రియాశీలక నాయకులు

ఓ వైపు ఎలాగైనా పార్టీల మద్దతు సాధించి సర్పంచ్‌లుగా పోటీచేయాలని కొందరు నాయకులు తహతహలాడుతుంటే, రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చినా ఆర్థిక పరిస్థితి అందుకు సహకరించకపోవడంతో క్రియాశీలక నాయకులు సైతం పోటీకి వెనకంజవేస్తున్న పరిస్థితి కొన్ని గ్రామాల్లో కనిపిస్తోంది. ప్రధానంగా పార్టీల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నప్పటికీ ఆర్థిక స్థోమత లేనివారు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ ఎన్నికల్లో ఆర్థికపరమైన సహాయం చేయలేమని తేల్చిచెబుతుండడంతో కొందరు మంచి పేరున్న కార్యకర్తలు సైతం అవకాశాలను వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. డబ్బు రాజకీయాల్లో తమ పేరు ప్రతిష్టలు, పార్టీకి చేసిన సేవలు కొరగాకుండా పోతున్నాయని, డబ్బున్నవారినే అభ్యర్థులుగా ఎంపికచేస్తుండడం తమ దురదృష్టమని సదరు నాయకులు వాపోతున్నారు.



మునుగోడు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నాయకుల సందడి

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు

మర్రిగూడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘింస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ఎర్రగండ్లపల్లిలోని నామినేషన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎన్నికల అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా సజావుగా నిర్వహించుకోవాలని అన్నారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికావొద్దని ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లఘించ వద్దన్నారు. ఈయన వెంట నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దూదిరాజు, మర్రిగూడ ఎస్ఐ కృష్ణారెడ్డి, ఎన్నికల క్లస్టర్ అధికారులు విఠల్, మాలతి తదితరులు ఉన్నారు.

నాంపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండల కేంద్రంలోని ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని డీఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో నామినేషన్‌లు, ఎన్నికలు జరిగే చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సీఐ డి.రాజు, ఎస్ఐ కె.లింగారెడ్డి ఉన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

నకిరేకల్, నవంబర్ 27, (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ఖానాపురం హవేలీలో ఈ నెల 28వ తేదీన 'బీసీ రిజర్వేషన్ల చరిత్ర' అనే అంశంపై నిర్వహించే బహుజన మహాసభను విజయవంతం చేయాలని బీసీ సంఘం నాయకుడు బొల్లికొండ లింగయ్య అన్నారు. మహాసభ పోస్టర్‌ను గురువారం నకిరేకల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్ష పార్టీలు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో మోసం చేశాయన్నారు. 42శాతం రిజర్వేషన్ ఇస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసిన అధికార పార్టీ నాయకులు బీసీలకు మోసం చేశారన్నారు. కార్యక్రమంలో యాదవహక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుగుడు రవియాదవ్, మేడిపల్లి సైదులు, కారింగుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి విగ్రహప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఉపాలయంలో సత్యనారాయణ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం గురువారం ఘనంగా జరిగింది. హయత్‌నగర్‌కు చెందిన ఆదిశంకరాచార్య ధర్మపీఠం పండి తులు పడకండ్ల వేంకటాచార్య యాజ్ఞీకంలో బ్రాహ్మణోత్తముల మంత్రో చ్ఛారణల మధ్య సత్యదేవుని వీరవెంకట సత్యనారాయణ స్వామి పంచలోహ విగ్రహాన్ని ప్రతిష్ఠంచారు. మురారిశెట్టి హరీశ్, దివ్య, బోయపల్లి శ్రీనివాస్ దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ వేడుకలో మాజీ ఎంపీపీ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, బత్తుల ఊశయ్య, అలుగుబెల్లి వివేకానందరెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, ఐతరాజు యాదయ్య, యాద వెంకన్న, కుర్మిళ్ల రఘు, పుల్లెంల శ్రీను, గడ్డం శివరాం తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో..

మండల కేంద్రంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాల సమీపంలో నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో కాలభైరవ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. యాజ్ఞీకులు బేతోజు సత్యనారాయణ శాస్త్రి సిద్ధాంతి యాజ్ఞీకంలో అర్చక స్వాములు ఉత్తరాపల్లి నర్సింహ్మాచార్యులు, శశిధర్, చౌల్లేటి పవణ్‌కుమార శర్మ ఆధ్వర్యంలో నవగ్రహ, కలశ, విగ్రహ ప్రతిష్ఠాపనా పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకలో గురిజ అశోక్‌స్వామి, క్రాంతి, విగ్రహదాత నరహరి సురేశ్ సంతోశ్, రామచంద్రు, రాములు, బండారు లక్ష్మి, గణేశ్, సందీప్, సైదులు, ఉపేందర్, అరవింద్‌చారి, నడింపల్లి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్నదానం

శాలిగౌరారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌లోని రైతులకు, హమాలీలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఫ్రీ మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా శాలిగౌరారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుజలాల్ శేఖర్ బాబు కుమార్తె కావేరి జన్మదినం సందర్భంగా 300 మంది రైతులకు భోజనం ఏర్పాటు చేశారు. నకిరేకల్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శాలిగౌరారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు గుజలాల్ శేఖర్ బాబు, దామెర్ల శ్రీనివాస్, గుండు పరమేష్, డెంకెల సత్యనారాయణ, బచ్చు ఆంజనేయులు, గుండు శంకర్ పాల్గొన్నారు.

మిషన్‌భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

నాంపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేళ్లవాయిలో మిషన్‌భగీరథ పైప్‌లైన్‌కు గురువారం కృష్ణా నీటిని సరఫరా చేసే సిబ్బంది మరమ్మతులు చేశారు. 13గ్రామాల ప్రజలు నెల రోజుల తర్వాత వచ్చిన కృష్ణా నీటిని చూసి సంతోషం వ్యక్తం చేశారు. మరమ్మతుల కోసం ప్రయత్నం చేసినా వర్షం, వర్షపునీరు, ఊట రావడంతో మరమ్మతులు సాధ్యం కాలేదని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటయ్య, శ్రీహరి, శేఖర్, రవి, ఉదయ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. 'బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కులపై గురువారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాలల హక్కులను పరిరక్షించాలన్నారు. బాల్య వివాహాలను నిరోధించడానికి 100 రోజల ప్రణాళికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సీడబ్ల్యూసీ చైర్మన్ కృష్ణయ్య, ఐసీడీఎస్ ఇన్‌చార్జి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లో మద్యం దుకాణాలు వద్దు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న 2వ వార్డు ప్రజలు

చండూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జనవాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని 2వ వార్డు ప్రజలు కోరారు. చండూరు మునిసిపల్ కమిషనర్ మల్లేశంకు గురువారం వినతిపత్రం అందజేశారు. బస్టాండ్ సమీపంలోనే వైన్స్ ఏర్పాటుతో పరిసర కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం మహిళలు, విద్యార్థులు రాకపోకలు సాగించే రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటుతో మూత్ర విసర్జన చేస్తూ, అల్లర్లకు పాల్పడుతూ, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై గతంలో మునిసిపల్ కమిషనర్, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మద్యం దుకాణాన్ని మరో చోటుకు మార్చాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏకాలపు ఆంజనేయులు, పగిళ్ల పవన్, నాగిళ్ల నరేష్, పగిళ్ల ప్రశాంత్, బోడ రాజు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలి

కట్టంగూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మాజీ జడ్పీటీసీ, పీసీసీ డెలికేట్ సుంకరబోయిన నర్సింహ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న పాత కాంగ్రెస్ పార్టీ నాయకులను స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మండలంలో 22 గ్రామపంచాయతీల్లో స్థానిక ఎమ్మెల్యే నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలతో సంబంధం లేకుండా తనకు నచ్చిన వ్యక్తులకు టికెట్లు కేటాయిస్తున్నారన్నారు. మంత్రి కోమటిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పోటీ చేస్తామని ఆయన తెలిపారు. మండలంలో ఎన్నో సంవత్సరాలు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చెరుకు యాదగిరి, నాయకులు మేడి ఇద్దయ్య, ఐతగోని అంజయ్య, ముక్కమాల శేఖర్, విద్యాసాగర్, యర్కల లక్ష్మీనారాయణ, గట్టిగొర్ల సత్తయ్య తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిక

నల్లగొండ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుడు విద్యావంతుడు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బడుపుల నగేష్ బీఆర్ఎస్ పార్టీకి రాజీమానా చేసి గురువారం బీజేపీ నాయకుడు పిల్లి రామరాజు యాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో చామకూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి దేవిగా ఎల్లమ్మ

కనగల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మార్గశిర మాసం మొదటి గురువారం పురస్కరించుకుని అమ్మవారు శ్రీకనకమహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముఖ్య అర్చకులు మల్లాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ఎంపీవోగా బాధ్యతల స్వీకరణ

మునుగోడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మునుగోడు మండల నూతన గ్రామ పంచాయతీ అధికారి(ఎంపీవో)గా సీహెచ్. మధు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి ఆయనకు బాధ్యతలు అప్పగించారు. మండలంలోని ఊకొండి కార్యదర్శి జానకిరాములు కొద్దిరోజులుగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించారు.

శివాలయ మండప విస్తరణ పనులకు భూమి పూజ

నార్కట్‌పల్లి, నవంబరు 27,(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లిలోని మాంద్రదారిలో ఉన్న పురాతన శివాలయం మండప విస్తరణ పనులకు గురువారం భూమి పూజ చేశారు. యాద వెంకన్న, ఇతర గ్రామస్తుల విరాళాలతో మంటప విస్తరణ పనులను నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు పుట్టపాక మురళీధర్‌రావు, దుబ్బాక శ్రీధర్, ఇడుకుళ్ల బిక్షమయ్య, పబ్బతి శేఖర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కట్టంగూరులో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కట్టంగూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ జీఈటీ ఎగ్జిక్యూటీవ్ కోఆర్డినేటర్ ఎర్ర శంభులింగారెడ్డి కోరారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ ఆధ్వర్యంలో యశోద ఆస్పత్రి, శ్రీనేత్ర ఆస్పత్రి హైదరాబాద్ సహకారంతో గురువారం కట్టంగూరులోని గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు సుమారు 250మందికి బీపీ, ఈసీజీ, షుగర్, టుడీఈకో, ఆర్‌బీఎస్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిక్కు శేఖర్, ప్రధాన కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, కోశాధికారి రాములు, రెడ్డిపల్లి సాగర్, కల్లూరి వెంకటేశ్వర్లు, కడారి మల్లికార్జున్, రాపోలు వెంకటేశ్వర్లు, గోశిక ఉమాపతి, వైద్యులు మనజీర్, మౌనికారెడ్డి, చంద్రశేఖర్, సూర్య, అశోక్‌రెడ్డి, ఉమాదేవి, రమేష్, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాకార నిర్మాణానికి భూమి పూజ



ప్రసన్నాంజనేయ స్వామి ప్రాకార నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దాతలు

నార్కట్‌పల్లి, నవంబరు 27,(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో నూతన సాలహార ప్రాకార నిర్మాణ పనులకు గురువారం భూమి పూజ చేశారు. నార్కట్‌పల్లికి చెందిన భక్తుడు యాద వెంకన్న కుటుంబ సభ్యులు దాతలుగా ఈ ఆలయ సాలహార ప్రాకార నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన సహాయ స్థపతి దామోదర్ సూచనల మేరకు వాస్తు, ఆగమ శాస్త్ర ప్రకారం ప్రాకారం, నూతన దీప స్తంభం ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు గుండేపూడి జానకిరామశర్మ, నిర్మాణదాత కుటుంబ సభ్యులు యాద సచిన్, బూర్గు జనార్ధన్, పసునూరి శ్రీనివాస్, దయాకర్, దోసపాటి ప్రసాద్, కోటయ్య, పసునూరి రమేశ్, రాములు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి




మునుగోడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండా శ్రీశైలం డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పీఎన్ఎం నాయకుడు కట్ట నర్సింహ, సీపీఎం మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, మిర్యాల భరత్‌కుమార్, యాసరాణి శ్రీను, లింగస్వామి, యాట యాదయ్య, రాములు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 28.0
కనిష్ఠం 17.0

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శుక్రవారం 28 నవంబరు 2025

గురుకులంలో ప్రకృతి ప్రసాదం

- సాగర్ గురుకులంలో విద్యార్థులకు జీవిత పాఠాలు
- పాఠశాల ఆవరణలో ప్రకృతి వ్యవసాయం

6



చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

గ్రామపంచాయతీ ఎన్నికల్లో రాజకీయ ఆసక్తికర పరిణామాలు నెలకొంటున్నాయి. పార్టీరహితంగా జరిగే ఎన్నికలైనప్పటికీ మంత్రులు సహా నాయకులంతా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో గ్రామాల్లో పార్టీల ప్రాతిపదికనే సమరం సాగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్ని చోట్ల పోటీకి సిద్ధమవగా, బీజేపీ, టీడీపీ, సీపీఎం, సీపీఐ పొత్తులు, స్థానిక సర్దుబాట్లతో ఎన్నికల బరిలో నిలవాలని సంకల్పించాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



పొత్తుల పంచాయతీలు

- పార్టీరహితం కావడంతో స్థానిక సర్దుబాట్లు
- నేతల నడుమ మొదలైన చర్చలు
- బీఆర్ఎస్ కొన్నిచోట్ల బీజేపీతో, మరికొన్ని చోట్ల సీపీఎంతో సీట్ల పంపకం
- అటు కాంగ్రెస్, ఇటు సీపీఎంతో సీపీఐ పొత్తు
- టీడీపీతో సర్దుబాటుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రయత్నాలు

కాంగ్రెస్‌తో రాష్ట్ర స్థాయిలో మైత్రి ఉండడంతో సీపీఐ ఆ పార్టీతో పాటు, సోదర మిత్రపక్షం సీపీఎంతో కలిసి పోటీలోకి దిగేందుకు సిద్ధమైంది. సీపీఎం రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్‌తో సఖ్యతగా ఉంటున్నందున జిల్లా కమిటీలు, మండల కమిటీలు అక్కడి స్థానిక పరిస్థితులు, క్యాడర్ మనోభావాల మేరకు సీపీఐతో సఖ్యతను కొనసాగిస్తూ అయితే కాంగ్రెస్, లేందటే బీఆర్ఎస్‌తో సీట్ల సర్దుబాటు చేసుకునేందుకు సిదమయ్యాయి. ఈ మేరకు చర్చలు కూడా ప్రారంభమయ్యాయి. బీజేపీ సైతం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాల ప్రకారం అన్ని గ్రామాల్లో పోటీచేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ పోటీపడే బలమైన నాయకుడు లేనిచోట్ల, అధికార కాంగ్రెస్‌ను తట్టుకునేందుకు పలుచోట్ల బీఆర్ఎస్‌తో జతకడుతోంది. ఉపసర్పంచ్ పదవులు, భవిష్యత్‌లో ఎంపీటీసీ పదవులతో పాటు, కొన్ని వార్డుల్లో సీట్ల సర్దుబాటు చేసుకునేందుకు ఆ పార్టీ నేతలు సిద్ధమయ్యారు. టీడీపీ సైతం క్యాడర్ అభిప్రాయాల మేరకు కొన్నిచోట్ల కలిసొచ్చే వారితో సీట్ల సర్దుబాటు చేసుకునేందుకు సిద్ధమైనట్లు క్షేత్రస్థాయిలో చర్చ సాగుతోంది. కాంగ్రెస్ బలంగా ఉన్నచోట్ల ప్రతిపక్షాలు పొత్తుపెట్టుకొని పోటీచేయాలని నిర్ణయించడంతో గ్రామసీమల్లో బలమైన పోటీ తప్పదనే సంకేతాలు కన్పిస్తున్నాయి.

కాంగ్రెస్‌లో అభ్యర్థిత్వాలకు పోటాపోటీ

అధికార కాంగ్రెస్ నుంచి సర్పంచ్ అభ్యర్థులుగా పోటీచేసేందుకు నాయకులు పోటీపడుతున్నారు. ప్రధానంగా ఓపెన్ కేటగిరీ, బీసీ రిజర్వ్ అయినచోట్ల ఈ ఒత్తిడి ఎక్కువగా ఉంది. దీంతో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు ఇతర కీలక నేతలు అభ్యర్థుల ఎంపిక అంశాన్ని మండల కమిటీలు, ముఖ్యనాయకులు, గ్రామనాయకులకు అప్పగించి అందరి ఆమోదంతో నిర్ణయించాలని సూచించడంతో ఆశావహులంతా నామినేషన్లు వేస్తున్నారు. నామినేషన్ల ఘట్టం ముగిసి, ఉపసంహరణల దశకు వచ్చేలోగా గ్రామాల్లో మంచిపేరు, వ్యక్తిత్వం, ఆర్థిక బలం, అంగబలం ఉంటే వారిని ఎంపికచేసి, మిగిలినవారికి నచ్చజెప్పేందుకు ముఖ్యనాయకులు కార్యాచరణ అమలు చేస్తున్నారు. అదే సమయంలో పొత్తుల్లో భాగంగా సీపీఐకి, కలిసొచ్చే ఇతర పార్టీలకు సీట్ల సర్దుబాటు చేయాల్సి ఉండడంతో ఎక్కడెక్కడ వారికి అవకాశమివ్వాలనే అంశాన్ని కూడా చర్చిస్తున్నారు. ఆర్థికభారం విషయంలోనూ కీలక నేతలు పోటీచేసే అభ్యర్థులే బరువు బాధ్యతలు చూసుకోవాలని...

- మిగతా 8వ పేజీలో...

నామినేషన్ కౌంటర్ — 1వ రోజు

జిల్లా	27న సర్పంచ్‌కు	ఇప్పటివరకు మొత్తం	వార్డు స్థానాలకు	ఇప్పటివరకు మొత్తం
నల్లగొండ	421	421	234	234
సూర్యాపేట	207	207	38	38
యాదాద్రి	205	205	134	134
మొత్తం	833	833	406	406

అన్నదాన సత్ర భవనానికి ముహూర్తం ఖరారు

» సుమారు రూ.23కోట్ల వ్యయం » రోజుకు 5వేల మంది భక్తులకు భోజన సౌకర్యం



కొండకింద అన్నదాన సత్ర భవనం

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి అన్నదాన సత్ర భవనం ఎట్టకేలకు ప్రారంభానికి నోచుకోనుంది. స్వయంభువులను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం అత్యాధునిక అన్నదాన సత్ర భవనాన్ని ఈ నెల 30న ప్రారంభించేందుకు ఆలయ అధికారులు ముహూర్తం ఖరారు చేశారు.

- (ఆంధ్రజ్యోతి,యాదగిరిగుట్ట)

అన్నసత్ర భవనం నిర్మాణానికి హరేరామ హరే కృష్ణ ఇస్కాన్ వంటి ఆధ్యాత్మిక సంస్థలతో సంప్రదింపుల అనంతరం గండిచెరువు సమీపంలో వైటీడీఏ డిజైన్ రూపొందించగా, మొత్తం సుమారు 2.07 ఎకరాలు కేటాయించారు. రూ.23కోట్లతో సుమారు 1.20 ఎకరాల్లో భవనాన్ని ఆధునికంగా నిర్మించారు. 2021లో ప్రారంభించిన భవన నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా గణపవరానికి చెందిన వేగేశ్న అనంతర కోటి రాజు రూ.14కోట్లు విరాళంగా ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వంట పరికరాలు, పాత్రలు శుభ్రం చేసే యంత్రాలను ఇక్కడ ఏర్పాటు. భవనంలో రెండు డైనింగ్, రెండు వెయిటింగ్ హాళ్లు, 12 స్టోరు గదులు, కేటాయించిన భూమిలో 25 శాతం వంటల గదిని నిర్మించారు. భక్తులు కూర్చోని భోజనం చేసేందుకు కుర్చీలు, టేబుళ్లు, భవన ఆవరణలో ప్రత్యేకంగా జల ప్రసాదం సిద్ధం చేశారు. నూతన భవనంలో 2వేల నుంచి 5వేల మంది భక్తులు ఒకేసారి భోజనం చేసేలా వసతి కల్పించారు.



దామరచర్లలో మండలంలో అమ్ముడుపోని ఓ ప్లాట్

దామరచర్లలో రియల్ ఢాం

» తగ్గిన పవర్ ప్లాంట్ క్రేజ్ » భూముల క్రయవిక్రయాలు తగ్గుముఖం

దామరచర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ ఏర్పాటు ప్రక్రియతో ఒక్కసారిగా దామరచర్ల మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎగసిపడింది. రోడ్లకు ఇరువైపులా ఉన్న బీడు భూములకు లక్షల నుంచి కోట్ల రూపాయలకు ధర చేరింది. ఎంతవేగంగా రియల్ ఎస్టేట్ పుంజుకుందో అంతే వేగంగా ధరలు పడిపోయాయి. దీంతో లక్షల రూపాయలు పెట్టుబడిపెట్టి స్థలాలు కొనుగోలు చేసిన వారు ప్రస్తుతం లబోదిబోమంటున్నారు.

దశాబ్దకాలంగా జిల్లాలో దామరచర్ల పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతూ వస్తోంది. నాపరాయి పరిశ్రమలతోపాటు సిమెంట్, ఇతర పరిశ్రమల ఏర్పాటుతో ఇక్కడి భూములకు కొంత మేర ధరలు పెరిగాయి. స్థానికంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ పనులు 2018 నుంచి వేగం పుంజుకున్నాయి. దీంతో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న టీఎస్‌జెన్‌కో ఉద్యోగులు బదిలీపై ఇక్కడ విధుల్లో చేరారు. దామరచర్ల, తాళ్లవీరప్పగూడెం శివారులోని ఇంటి స్థలాలు, వ్యవసాయేతర భూముల కొనుగోలుకు వారు ఆసక్తి చూపడంతో భూముల క్రయవిక్రయాలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో రోడ్డు వెంట ఉన్న భూములు ఎకరం రూ.40లక్షల నుంచి రూ.కోటి వరకు ధర పలికింది. ఊహించిన దానికంటే ఎక్కువ ధర పలకడంతో పలువురు రైతులు భూములను విక్రయించారు. వాటిని కొనుగోలు చేసిన కొందరు ప్లాట్లు, ఇంటి స్థలాలుగా మార్చి విక్రయించుకోగా, మరికొందరు వాటినే అట్టిపెట్టుకున్నారు. 2022 నుంచి పరిస్థితి భిన్నంగా మారింది. స్థలాల క్రయవిక్రయాల జోరు తగ్గింది. పరిశ్రమ పూర్తయితే స్థలాలు కొనుగోలు చేసిన వారికి భారీ లాభాలు వస్తాయని రియల్టర్ల మాటలు నమ్మి సామాన్య, మధ్యతరగతి వారు సైతం పెద్ద సంఖ్యలో ప్లాట్లు కొనుగోలు చేశారు. ధరలు పెరగకపోవడంతో తాము నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని వారు ప్రస్తుతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో రియల్ ఎస్టేట్ వేగం పుంజుకోకపోవడానికి ప్రధాన కారణం పవర్‌ప్లాంట్ క్రేజ్‌తో అధిక ధరలకు కొనుగోలు చేయడమేనని తెలుస్తోంది.

● ఇంటి స్థలం కొనుగోలు చేసి నష్టపోయా

2022లో దామరచర్ల మండల కేంద్రంలో రూ.15లక్షలు వెచ్చించి ఇంటి స్థలం కొనుగోలు చేశా. ఆ సమయంలో రియల్‌ఎస్టేట్ భూముల ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో భవిష్యత్‌లో మంచి ధర వస్తుందని అప్పు చేసి మరీ కొనుగోలు చేశా. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో స్థలానికి ధర రాకపోవడంతో విక్రయించేందుకు సిద్ధమైనా తక్కువ ధరకు అడుగుతున్నారు. దీంతో సుమారు రూ.5లక్షలు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

ఓ కొనుగోలుదారుడు

తేమ, తూకాల పేరుతో.. వసూళ్లు

ఇవ్వకుంటే కాంటాలు నిలిపివేత

ఇదీ త్రిపురారం ఐకేపీ నిర్వాహకుల దందా

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిలువునా దోచుకుంటున్నారు. తేమశాతం, తూకాల పేరుతో రైతులనుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని అడిగితే కాంటాలు వేయకుండా కొర్రీలు పెడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-త్రిపురారం)



త్రిపురారం మండలకేంద్రంలో వెలుగు ఆధ్వర్యంలో ఓమహిళా సంఘం ధాన్య కొనుగోలుకేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. సదరు మహిళలు డబ్బు సంపాందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యానికి తేమ, తూకాల పేరుతో కొర్రీలు పెడుతూ కాంటాలు వేయడంలేదు. డబ్బులు చెల్లిస్తేనే కాంటాలు వేస్తున్నారని, ధాన్యాన్ని పరిమాణాన్ని అనుసరించి రూ.1500 నుంచి రూ.5వేలు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా తేమ 17శాతం ఉండాలనే నిబంధనతో కాంటాలు వేస్తారు. ఇక్కడ మాత్రం పైసలు ఇస్తేనే పని జరుగుతుంది. లేకపోతే ధాన్యం చాలా తేమగా ఉందని కాంటాలు వేయరు.ఈ కేంద్రంలో ప్రతీ రైతునుంచి డబ్బులు వసూలు చేయడం సర్వ సాధారణంగా మారింది.

ఎందుకివ్వాలని ప్రశ్నిస్తే ఇక అంతే

తేమ శాతం తగ్గినా డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే ఇక అంతే సంగతి. ధాన్యం మిల్లుకు చేరుకున్నాక, అక్కడ తూకంలో తగ్గిందని, మీరు డబ్బులు ఇస్తే మిల్లు వాళ్లకి చెప్పి లెక్క సరి చేస్తామని చెప్పి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు నిర్వహించే కొనుగోలుకేంద్రంలో ఇప్పటివరకు 8,491 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఒక్క రైతును వదలకుండా కొర్రీలు పెట్టి భారీగా డబ్బులు గుంజినట్లు సమాచారం. ఓ గ్రామానికి చెందిన మహిళ తన పొలంలో పండిన ధాన్యాన్ని త్రిపురారం కేంద్రానికి తీసుకొచ్చింది. తేమ ఉందని, ఇప్పుడు కాంటా కాదని నిర్వాహకులు ఆమెను భయపెట్టారు. చాలా రోజులు ఆరబెట్టానని ధాన్యం బాగా ఆరిందని బతిమాలినా వారు వినిపించుకోలేదు. చివరకు 45బస్తాలకు (40 కిలోలు) రూ.16వందలు వసూలుచేశారని, ఈ విషయం ఎవరికి చెప్పినా ధాన్యం డబ్బులు పడవని నిర్వాహకులు చెప్పారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘం నిర్వాహకులు ఫోన్ ద్వారా డబ్బులు వసూలు చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. క్వింటా ధాన్యం కాంటాకు హమాలీకి రూ.45లు తీసుకోవాల్సి ఉండగా అదనంగా రూ.5 వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా విషయం బయటకు రాకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంతో రైతులు నిలువు దోపిడీకి గురయ్యారు. ఈకేంద్రంలో జరిగిన ధాన్యం కొనుగోలుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి రైతుల నుంచి డబ్బులు వసూలు చేసిన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తేమ ఉందని రూ.4,800 తీసుకున్నారు



ఐకేపీ కేంద్రానికి 50క్వింటాళ్ల ధాన్యం తెచ్చాను. తేమ పేరుతో కాంటా వేయకుండా జాప్యం చేశారు. కాంటా వేయాలంటే డబ్బులు డిమాండ్‌చేశారు. అందరూ ఇస్తున్నారు.. మీరు ఇస్తేనే పని అవుతుందని చెప్పారు. చివరకు రూ.4,800 తీసుకున్నారు. రూ.4వేలు ఫోన్‌పే ద్వారా, రూ.800 నగదు రూపంలో నిర్వాహకులకు చెల్లించాను. అధికారులు ఈకేంద్రంలో ధాన్యం విక్రయాలు చేసిన రైతులను విచారిస్తే నిజం తెలుస్తుంది.

- గజ్జి సైదులు, రైతు, కోమటిగూడెం, త్రిపురారం

మా దృష్టికి రాలేదు

కొనుగోలుకేంద్రం నిర్వాహకులు రైతులనుంచి నగదు వసూలు చేశారనే విషయం మా దృష్టికి రాలేదు. రైతులు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

- నాగేందర్, వెలుగు, ఏపీఎం

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కొర్రా లక్ష్మి

నల్లగొండ (కలెక్టరేట్), నార్కట్‌పల్లి, చిట్యాలరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కొర్రా లక్ష్మి ఆదేశించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలుగా నియమితులైన ఐఏఎస్ అధికారి, రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కొర్రా లక్ష్మి గురువారం కలెక్టరేట్‌కు రాగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి పూల మొక్కతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్‌తో కలిసి ఆమె పరిశీలించారు. నార్కెట్‌పల్లిలో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రాన్ని, చిట్యాల మండలం వెలిమినేడులో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్, అభ్యర్థుల నామినేషన్ పత్రంతో పాటు సమర్పించాల్సిన ధ్రువపత్రాలను పరిశీలించి హెల్ప్‌డెస్క్ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఆర్‌వో గదులను, పోలింగ్ సామగ్రి, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. వారి వెంట అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా నియమితులైన ఆదిత్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, జిల్లా అబ్జర్వర్ల నోడల్ అధికారి, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రమేష్, ఎంపీడీవోలు కత్తురోజు ఉమేశ్‌చారి, జయలక్ష్మి, ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ, ఎంపీవో అనుముల కోటేష్ ఉన్నారు.



నల్లగొండలో ఎన్నికల ఏర్పాట్ల వివరాలను వివరిస్తున్న కలెక్టర్

కలెక్టర్ ఔదార్యం..
కళా మహోత్సవ్‌కు విద్యార్థినులు

- బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌కు జిల్లా నుంచి 50మంది విద్యార్థినులు
- రెండు బస్సుల్లో పయనం

7



కైలాష్‌పై మంత్రి కక్షసాధింపు
మానుకోవాలి

బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ ప్రసన్నకుమార్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జేఏసీ చైర్మన్ ప్రసన్నకుమార్

నల్లగొండ టౌన్, నవబంరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన పున్నా కైలాష్‌నేతపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గంగపుత్ర భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడిగా నియమితుడైన పున్నా కైలాష్‌పై మంత్రి వెంకట్‌రెడ్డి సీఎంకు రాసిన లేఖను తక్షణమే వెనక్కి తీసుకొని బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ నేత, బీసీ వర్గానికి చెందిన కైలాష్‌కు పదవి ఇవ్వడాన్ని జీర్ణించుకోలేని జిల్లా మంత్రి వెంకట్‌రెడ్డి, గతంలో చేసిన విమర్శను ప్రస్తుతం ప్రస్తావనకు తీసుకొచ్చి సీఎంకు లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పి.సైదులు మాట్లాడుతూ, బహుజన వర్గాలపై అణచివేత అధికమైతే తిరుగుబాటు తీవ్రమవుతుందన్నారు. బీసీ విద్యార్థి జేఏసీ జిల్లా చైర్మన్ అయితగోని జనార్ధన్ గౌడ్ మాట్లాడుతూ, బీసీ బిడ్డకు జిల్లా అధ్యక్ష పదవి దక్కితే ఓర్వలేక ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించడం తగదన్నారు. సమావేశంలో నాయకులు గజ్జి అజయ్‌యాదవ్, చెన్నూరి భరద్వాజ్‌యాదవ్, చిలకరాజు సతీష్‌కుమార్, మార్గం సతీష్‌కుమార్, కర్నాటి యాదగిరి, చిలకరాజు చెన్నయ్య, దుడ్డు కృష్ణమూర్తి, మల్లెబోయిన సతీష్‌యాదవ్, అనంత నాగరాజుగౌడ్, చీరబోయిన వెంకన్న, కల్లూరి సత్యనారాయణగౌడ్, అంబటి శివ, పులిపాటి జీవన్, బాతుక సతీష్ యాదవ్ యోగానంద్, తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో మాట్లాడుతున్న మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి

బీఆర్ఎస్‌తోనే
తెలంగాణ వచ్చింది

- కేసీఆర్ వల్లే రాష్ట్ర ఏర్పాటు కల సాధ్యమైంది
- దీక్షా దివస్‌ను పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

7

ఎన్నికలు సజావుగా సాగేలా పని చేయాలి

ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అమిత్‌నారాయణ్

నల్లగొండ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సజావుగా సాగేలా ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేయాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు సమయ పాలనతో బాధ్యతలు నిర్వహించాలన్నారు. బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీములు, జోనల్ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు వాహనాలను సమకూర్చుకోవాలని అన్నారు.

తొలి రోజు ప్రశాంతంగా నామినేషన్లు

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలి రోజు నల్లగొండ, చండూరు డివిజన్లలో నామినేషన్లు ప్రశాంతంగా ముగిశాయని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, ఎంసీఎంసీ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మొదటి విడత నల్లగొండ, చండూరు డివిజన్లలోని 14 మండలాల్లోని 318 గ్రామపంచాయతీలకు సంబంధించి నామినేషన్లు స్వీకరించినట్లు తెలిపారు. జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పీవో, ఏపీవోలకు శిక్షణ ఇచ్చామని, ఎన్నికల నిర్వహణకు 285 రూట్ ఆఫీసర్లు, 177 మంది జోనల్ అధికారులను నియమించామన్నారు. అలాగే పోలింగ్ సిబ్బంది, అవసరమైన వాహనాలు, బ్యాలెట్ పేపర్లు, అన్ని రకాల సామగ్రిని సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జడ్పీ సీఈవో శ్రీనివాస్‌రావు, డీపీవో వెంకయ్య, వెంకటాద్రి, తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

చింతపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమానికి నిధులు కేటాయించాలని రంగారెడ్డి బ్రాహ్మణ పురోహిత సంఘం సభ్యుడు డేరం భాస్కర్‌శర్మ అన్నారు. గురువారం మండలంలోని వేంకటేశ్వరనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాజంలోని బ్రాహ్మణులందరూ ఐకమత్యంతో అన్ని రంగాల్లో రాణించినప్పుడే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యుల రవీంద్రనాథ్ శర్మ, మహంకాళి ఉపాసకుడు నాగభట్ల పవన్‌కుమార్‌శర్మ, శ్రీనాథ్‌శర్మ, కులకర్ణి మంజునాథ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ కార్యదర్శిగా నిరంజన్

దేవరకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ ఐఎన్‌టీయూసీ(327) జిల్లాశాఖ కార్యదర్శిగా దేవరకొండ లైన్‌మెన్ ఎండీ నిరంజన్ ఎన్నికయ్యారు. గురువారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో నూతనంగా ఎన్నికైన నిరంజన్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, ముత్తయ్య, రాజేశ్వర్‌రావు, రమణారెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

అనుకున్నదొక్కటి.. అయినదొక్కటి

● గ్రామపంచాయతీల వార్డుల్లో ఎస్సీలకు స్థానాలేవీ? ● ఇందుగులలో ముగ్గురే ఓటర్లు.. అయినా ఎస్టీ రిజర్వ్● నైరాశ్యంలో ఆశావహులు

జనాభా దామాషా ప్రకారం రావాల్సిన సీట్ల కేటాయింపు.. అందుకు విరుద్ధంగా జరిగింది. దీంతో ఆశావహులు నైరాశ్యంలో పడ్డారు. ఒక సామాజిక వర్గానికి చెందిన ముగ్గురే ఓటర్లున్న చోట వారికి రిజర్వేషన్ ఖరారు కాగా, అధికంగా ఉన్న మరో సామాజిక వర్గానికి మొండిచేయి దక్కింది. దీంతో వారి ఆశలు అడియాసలయ్యాయి. మాడ్గులపల్లి మండలంలోని చాలా గ్రామాల్లో ఎస్సీ సామాజిక వర్గానికి వార్డు స్థానాల్లో ప్రాధాన్యం దక్కలేదు. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-మాడ్గులపల్లి)



ప్రభుత్వం ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ప్రకటించినప్పటికీ మండలంలో ఉన్న ఎస్సీ సామాజికవర్గానికి వార్డు స్థానాల్లో ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇందుగుల గ్రామపంచాయతీ ఎస్టీ రిజర్వేషన్ ఖరారు చేశారు. అయితే గ్రామంలో మూడు ఓట్లు మాత్రమే ఎస్టీలున్నా, సర్పంచ్‌గా ఎస్టీకి రిజర్వ్‌చేశారు. అయితే గ్రామంలో ఎక్కువ మంది ఎస్సీలు ఉన్నా, వార్డు స్థానాల్లో మాత్రం ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇందుగులలో 10 వార్డులు ఉండగా జనరల్-5, బీసీలకు ఒక స్థానం, ఎస్టీ-4 స్థానాలు కేటాయించడంతో గ్రామంలో మూడు ఓట్లు ఉన్న ఎస్టీ సామాజికవర్గానికి నాలుగు వార్డులు కేటాయించారు. చెరువుపల్లి గ్రామంలో 10 వార్డులు ఉన్నప్పటికీ సర్పంచ్ స్థానం జనరల్ రిజర్వ్ అయింది. జనరల్ ఐదు వార్డులు, బీసీలకు-2, ఎస్టీలకు-3 కేటాయించారు. ఎస్సీ జనాభా ఉన్నప్పటికీ ఒక్క వార్డు కూడా కేటాయించపోవడంతో నిరాశలో రెండు ఎస్సీ స్థానాలు కేటాయించినట్లు గ్రామస్థులు తెలిపారు.

మాడ్గులపల్లిలో సర్పంచ్.. బీసీ జనరల్

మాడ్గులపల్లిలో సర్పంచ్ స్థానం బీసీ జనరల్‌కు కేటాయించారు. గ్రామంలో 10 వార్డులు ఉండగా జనరల్-5, బీసీ-3, ఎస్టీ-2లకు కేటాయించడంతో మాడ్గులపల్లిలో సుమారు 529మంది ఓటర్లు ఉన్నప్పటికీ ఎస్సీకి ఒక వార్డు కేటాయించకపోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో రెండు వార్డులు కేటాయించగా ప్రస్తుతం ఒక్కస్థానం కూడా కేటాయించకపోవడంతో ఎస్సీలు అభ్యంతరం వ్యక్తంచేశారు. కొత్తగూడెం గ్రామంలో సర్పంచ్ జనరల్ స్థానం కేటాయించగా గ్రామంలో 8వార్డులు ఉండగా జనరల్-4, బీసీ-3, ఎస్టీ-1 కేటాయించారు. గ్రామంలో ఎస్సీ జనాభా ఉన్నప్పటికీ ఒక్క స్థానం కూడా కేటాయించలేదు. గతంలో ఎస్సీలకు ఒక వార్డు కేటాయించారు. దాచారం గ్రామంలో సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయించగా మొత్తం 8 వార్డులు ఉండగా జనరల్-4, బీసీ-3, ఎస్టీ-1 స్థానానికి కేటాయించడంతో ఈ గ్రామంలో కూడా ఎస్సీలకు ఒక్క వార్డు కేటాయించలేదు. అదేవిధంగా అభంగాపురం గ్రామంలో సర్పంచ్ ఎస్టీకి కేటాయించగా, గ్రామంలో 8 వార్డులు ఉండగా ఎస్టీ-3, బీసీ-1, జనరల్-4 స్థానాలను కేటాయించారు. గతంలో గ్రామంలో ఎస్సీలకు మూడువార్డులు కేటాయించగా ప్రస్తుతం ఒక్క వార్డు కూడా ఎస్సీకి కేటాయించలేదు. గజలాపురం గ్రామంలో సర్పంచ్ ఎస్టీకి కేటాయించగా 8 వార్డుల ఉండగా ఎస్టీ-2, బీసీ-3, జనరల్-3 స్థానాలు కేటాయించారు. గతంలో ఎస్సీలకు 3 స్థానాలు కేటాయించగా ప్రస్తుతం ఒక్క స్థానం కూడా కేటాయించకపోవడం ఆశ్చర్యకరం. గ్రామంలో ఎస్టీ ఓటు ఒక్కటే ఉన్నప్పటికీ సర్పంచ్ స్థానం ఎస్టీకి కేటాయించడం ఎక్కువ వార్డు స్థానాలు ఎస్టీలకు కేటాయించడంతో ఎస్సీలకు ప్రాధాన్యం తగ్గింది. పూసలపాడు గ్రామం జనరల్ కేటాయించగా గ్రామంలో 8 వార్డులు ఉండగా బీసీలకు-2, జనరల్-4, ఎస్టీ-2 స్థానాలు కేటాయించారు. ప్రస్తుతం ఎస్సీలకు ఒక్క వార్డు కూడా కేటాయించలేదు. గతంలో మూడు వార్డులు కేటాయించగా ప్రస్తుతం ఒక్కటి కూడా లేకపోవడంతో ఎస్సీలు ఆందోళన చెందుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చింతపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని చాకిలిశేరుపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సమక్షంలో గురువారం రాత్రి కాంగ్రెస్‌లో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొల్లగోని మల్లమ్మ జంగయ్య గౌడ్, బి.బుచ్చయ్య, కేశగోని వెంకటేష్ గౌడ్, గడిగ లింగం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పగడాల రామకృష్ణ, పార్టీలో చేరిన వారిలో కేశగోని యాదయ్య, పగడాల జంగయ్య, సైదులు, కేశగోని మల్లేష్, కె.రవి, బూడిద నరసింహ, యాదయ్య ఉన్నారు.

నేరేడుగొమ్ము: మండలంలోని ధర్మారేఖ్య తండా, పేర్వాల గ్రామాలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తండాలో ఎన్నికల ప్రచార ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొని, పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లోకసాని కృష్ణయ్య, ముక్కమాల వెంకటయ్య, బిక్కునాయక్, యోగేందర్‌రెడ్డి, బాలు పాల్గొన్నారు.

ఎన్నికలను వాయిదా వేయాలి

● బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

దేవరకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్‌చేశారు. గురువారం దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి మాట్లాడారు. జీవో 46ద్వారా బీసీలకు అన్యాయం జరుగుతుందని, జీవో 46ను రద్దుచేసి చట్టబద్ధంగా 42శాతం రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, కృష్ణ, శివగౌడ్, భిక్షమయ్య పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడే వారిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నిడమనూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల పక్షాన పోరాడే వారిని గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై అవగాహన కలిగి, వాటి పరిష్కారానికి నిత్యం ప్రజా పోరాటాలు చేస్తున్నది తమ పార్టీనే అని గుర్తు చేశారు. ప్రజల పక్షాన నిరంతరం ఉద్యమాలు చేస్తున్న వారికి అండగా నిలవాలన్నారు. ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా ప్రజలకోసం పని చేసేవారిని ఎన్నుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కొండేటి శ్రీను, కత్తి లింగారెడ్డి, కందుకూరి కోటేష్, ఆకారపు నరేష్, కొమాండ్ల గుర్వయ్య, నల్లబోతు సోమయ్య, చంద్రశేఖర్, శివ, సామంత్, కుంచం శేఖర్, కేశవులు పాల్గొన్నారు.

రాజ్యాంగం గురించి తెలుసుకోవాలి



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రాజ్యాంగం గురించి తెలుసుకోవాలని బకాల్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, దేశ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించాల్సిన విద్యార్థులు రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నల్లమేకల వెంకయ్య, కర్నాటి శ్రీనివాస్, అజ్మత్ ఖాన్, సిద్ధి, పద్మజ, సైదులు, ఉదయకుమారి పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని నంగారభేరి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ నందకుమార్‌నాయక్ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను రాజకీయం చేయవద్దన్నారు. ప్రతీ ఓటరు తమ హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కుటుంబంలోని ఓటర్లందరినీ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేసేలా చూడాలన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

దామరచర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భూభారతిలో దరఖాస్తు చేసుకున్న రైతుల సమస్యలను పరిష్కరించాలని బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందాల శంభయ్య అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. భూభారతిలో సమస్యలను పరిష్కరించాలని అనేక మంది రైతులు దరఖాస్తు చేసుకోని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.కార్యక్రమంలో ఖాదర్, ఎస్‌కె.సద్దాం, మధుగౌడ్, ఎర్రమాద కుమార్, అశోక్, రమేష్, వినోద్ పాల్గొన్నారు.

బీసీలను రాజకీయ సమాధిచేసే కుట్ర

● కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై తీరని అన్యాయం చేశాయి ● బీసీ జేఏసీ రాష్ట్రకన్వీనర్ జాజుల లింగయ్యగౌడ్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాజుల లింగయ్య గౌడ్

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బీసీలను రాజకీయంగా సమాధి చేసేందుకు జరుగుతున్న కుట్రను ఎదిరించేందుకు ప్రతి ఒక్కరూ కదలిరావాలని బీసీ జేఏసీ రాష్ట్రకన్వీనర్ జాజుల లింగయ్యగౌడ్ అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీసీలకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 30న చేపట్టిన రాజకీయ యుద్ధభేరి పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై బీసీలకు తీరని అన్యాయం చేశాయన్నారు. జనాభాలో 60శాతం ఉన్న బీసీలకు కేవలం 17శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. 42 శాతం రిజర్వేషన్ల హామీని తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. రోస్టర్ విధానం పేరుతో చేసిన అన్యాయాన్ని ఎదిరించేందుకు తలపెట్టిన యుద్ధభేరి కార్యక్రమానికి బీసీలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, సయ్యద్‌ఫరూక్, మహేష్ గౌడ్, బంటు కవిత, సైదులు, రాజుకుమార్, సురేష్, ఎస్‌పీ నాయుడు, నాగరాజు, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి

గుర్రంపోడు, వేములపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని సంఘం నాయకులు కోదాటి మధుసూదన్, దాసరి ప్రభాకర్ అన్నారు. గురువారం గుర్రంపోడు, వేములపల్లిలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న జరిగే సమావేశానికి ఉపాధ్యాయులు హాజరుకావాలని వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 30న తిప్పర్తిలో జిల్లాకమిటీ విస్తృత స్థాయి సమావేశానికి ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బూతం సైదులు, యాదగిరి, మహిళా ఉపాధ్యక్షురాలు విజయనిర్మల, ఉపాధ్యాయులు శ్రీదేవి, రామలింగమ్మ, శంకర్, సృజన పాల్గొన్నారు.



గుర్రంపోడులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో గురువారం మండలకేంద్రంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ దృష్ట్యా రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్లడం, మద్యం తరలించడం, ఓటర్లను ప్రలోభ పెట్టే ఇతర చర్యలకు పాల్పడ వద్దన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సాఫీగా జరిగేందుకు సహకరించాలన్నారు. అంతకు ముందు మండలకేంద్రంలోని సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఎంపీడీవో చంద్రమౌళి, ఎంఈవో వెంకటయ్యతో కలిసి పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గుర్రంపోడు: మండలంలోని కొప్పోలు, బొల్లారం, నడికుడ గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఎంపీడీవో మహేష్ గురువారం పరిశీలించారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. ఎన్నికల సమయంలో ఏర్పడే సమస్యల అంశాల వివరాలను సేకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: స్థానిక ఎన్నికల ఏర్పాట్లను కొండమల్లేపల్లి మండల అధికారులు గురువారం పరిశీలించారు. కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఎన్నికల సామగ్రి కేంద్రం ఏర్పాటు చేయడానికి సరైన వసతులపై ఆరా తీశారు. అనంతరం పెండ్లిపాకల, వర్ధమానిగూడెం, గుడితండా, ఫకీర్‌పురంలో పోలింగ్‌కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వర్ణలత, తహసీల్దార్ నరేందర్, ఎంపీవో చింతపల్లి మధు, ఎస్ఐ అజ్మీరా రమేష్, పంచాయతీ కార్యదర్శి డాకునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



పీఏపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

నిరుపయోగంగా ఓపెన్ జిమ్

అధ్వానంగా మారిన ఓపెన్ జిమ్



మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిరుపయోగంగా మారింది. పాఠశాల విద్యార్థులతోపాటు కాలనీవాసులు వ్యాయామం చేసేందుకు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమే. అయితే సదరు జిమ్‌లోని పరికరాలను ఉపయోగించుకునే వీలే లేకుండా కాంక్రీటు దిమ్మెలు, ఎండిపోయిన చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నాయి. అడ్డు తొలగించాలని సంబంధిత అధికారులను స్థానికులు కోరుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

నీటిశుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేయరూ..

మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాష్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాల కార్పొరేట్ స్కూల్‌ను తలపించేలా అభివృద్ధి చెందింది. మన ఊరు-మన బడి పథకంలో భాగంగా పాఠశాల భవనాన్ని సుందరంగా నిర్మించారు. విశాలవంతమైన తరగతి గదులు, పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది. అయితే విద్యార్థులు తాగేందుకు అవసరమైన సురక్షిత నీటి వసతి లేదు. ఈ నేపథ్యంలో పాఠశాలకు నీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేయాలని అక్కడి అభ్యసిస్తున్న 72మంది చిన్నారులు కోరుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

● మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఉజ్జిని యాదగిరిరావు

చింతపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. గురువారం చింతపల్లి మండల కేంద్రంలో జరిగిన సీపీఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపుతో సంబంధం లేకుండా సీపీఐ నుంచి ప్రతీ గ్రామంలో అభ్యర్థులు నామినేషన్లు వేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేవిధంగా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ఉజ్జిని అంజల్‌రావు, పల్లపు లక్ష్మయ్య, వేముల బుచ్చయ్య, మల్లోజు శేఖరాచారి, షేక్ శంషొద్దీన్, కౌన్సిల్ సభ్యులు కంబాలపల్లి లక్ష్మయ్య, మస్కు వెంకటయ్య, వర్కాల నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

తోటి ఉద్యోగి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఉద్యోగులు

నాగార్జునసాగర్, నవంబబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీ కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిలో పేషెంట్ కేర్ టేకర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవలో మృతి చెందిన సతీష్ కుటుంబానికి తోటి ఉద్యోగులు ఆర్థికసాయం చేశారు. రూ.65వేలు సేకరించి సతీష్ కుమార్తె పేరున రూ.50వేలు, కుమారుడి పేరున రూ.15వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ డిపాజిట్ బాండ్‌లను ఆసుపత్రి సీఎంవో డాక్టర్ భానుప్రసాద్ గురువారం సతీష్ భార్య వసంతకు అందజేశారు.

పొత్తుల పంచాయతీలు

(5వపేజీ తరువాయి)

తామెలాంటి ఆర్థిక మద్దతు ఇవ్వలేమని, గెలిచివచ్చాక అభివృద్ధికి అవసరమైన నిధులు మాత్రం కోరినంత ఇప్పిస్తామని స్పష్టం చేస్తుండడతో కొందరు ఆశావహులు పోటీకి వెనకంజవేస్తున్న పరిస్థితి ఉంది. గ్రామాల్లో మంచిపేరు ఉన్నా, ఆర్థికంగా ఖర్చుపెట్టే స్థోమత లేక అవకాశాలు వదులుకునేందుకు కొందరు క్రియాశీలక నాయకులు సిద్ధమవడంపై పార్టీలో చర్చ సాగుతోంది.

కలిసొచ్చే పార్టీలతో బీఆర్ఎస్

కాంగ్రెస్‌ను స్థానిక సమరంలో నిలువరించాలనే పట్టుదలతో ఉన్న బీఆర్ఎస్ నాయకత్వం పంచాయతీ ఎన్నికల్లో బలమైన పోటీకి సిద్ధమవుతోంది. అదే సమయంలో స్థానికంగా ఆయా గ్రామాల్లో ఓటుబ్యాంకు, నాయకత్వం ఉన్న బీజేపీ, సీపీఎంతో కలిసి సీట్లను సర్దుబాటు చేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. సర్పంచ్‌లుగా బీఆర్ఎస్ అభ్యర్థులు బరిలో ఉంటే, ఉపసర్పంచ్‌లుగా బీజేపీ అభ్యర్థులకు, సీపీఎం బలంగా ఉన్న చోట్ల వారికి ఇవ్వాలని చర్చిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఇలాంటి ప్రతిపాదనలతో ఇరుపార్టీల స్థానిక క్యాడర్ మధ్య చర్చలు సాగుతున్నాయి. అదేవిధంగా వార్డుల్లోనూ పొత్తుల ద్వారా వెళ్లాలని భావిస్తున్నారు. నల్లగొండ నియోజకవర్గంలోని ఒక మండలంలో సీపీఎం మూడు సర్పంచ్ సీట్లు, అన్ని పంచాయతీల్లో కొన్నివార్డు స్థానాలు, కొన్ని గ్రామాల్లో ఉపసర్పంచ్ పదవులను, భవిష్యత్‌లో జరిగే ఎంపీటీసీ స్థానాల్లో కొన్నింటిని చర్చల్లో ప్రతిపాదించినట్లు సమాచారం. ఇంకా అధికారికంగా సీట్ల సర్దుబాటు కాలేదని, కలిసి పోటీచేయడానికి అంగీకారానికి వచ్చినట్లు క్యాడర్‌లో చర్చ సాగుతోంది.

ఆర్థికబలం లేక వెనకంజవేస్తున్న క్రియాశీలక నాయకులు

ఓ వైపు ఎలాగైనా పార్టీల మద్దతు సాధించి సర్పంచ్‌లుగా పోటీచేయాలని కొందరు నాయకులు తహతహలాడుతుంటే, రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చినా ఆర్థిక పరిస్థితి అందుకు సహకరించకపోవడంతో క్రియాశీలక నాయకులు సైతం పోటీకి వెనకంజవేస్తున్న పరిస్థితి కొన్ని గ్రామాల్లో కనిపిస్తోంది. ప్రధానంగా పార్టీల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నప్పటికీ ఆర్థిక స్థోమత లేనివారు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ ఎన్నికల్లో ఆర్థికపరమైన సహాయం చేయలేమని తేల్చిచెబుతుండడంతో కొందరు మంచిపేరున్న కార్యకర్తలు సైతం అవకాశాలను వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. డబ్బు రాజకీయాల్లో తమ పేరు ప్రతిష్టలు, పార్టీకి చేసిన సేవలు కొరగాకుండా పోతున్నాయని, డబ్బున్నవారినే అభ్యర్థులుగా ఎంపికచేస్తుండడం తమ దురదృష్టమని సదరు నాయకులు వాపోతున్నారు.